PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 143 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 21 మే 2025

## పెంచిన మెట్రో ఛార్జీల్లో స్వల్పంగా తగ్గింపు




## వికారాబాద్ ప్రమాదంపై సీఎం దిగ్భ్రాంతి






## సిఎం రేవంత్‌తో నష్యా కాన్సుల్ జనరల్ భేటీ

**హైదరాబాద్,20(పిసిడబ్ల్యూ న్యూస్):**జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చెన్నైలోని రష్యా కాన్సుల్ జనరల్ శ్రీ వాలెరీ ఖోడ్జాయేవ్ మర్యాదపూర్వకంగా కలిసారు. తెలంగానలో చేపట్టిన అభివృద్ధి పనులను, పెట్టుబలుకు సంబంధించిన అంశాలను చర్చించారు. ఫ్యూచటర్ సిటీతో పాటు పలు అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం.



# కాళేశ్వరం కమిషన్ దూకుడు

●విచారణలో మరింత వేగం ●కెసిఆర్ తదితరులకు నోటీసులు ●జూన్ 5న విచారణకు రావాలిన ఆదేశం ●6న హరీష్ రావు, 9న ఈటెల హాజరుకు నోటీస్లు

**హైదరాబాద్,మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):** కాళేశ్వరం కమిషన్ దూకుడు పెంచింది. ఇంతకాలం అధికారులను విచారించిన కమిషన్ ...ఇప్పుడు ఇందులో కీలకంగా ఉన్ననేతలను విచారణకు పిలుస్తోంది. ఈ క్రమంలోభారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు ఇచ్చింది. ఆయనతో పాటు– మాజీ మంత్రి హరీశ్‌రావు, భాజపా ఎంపీ ఈటల రాజేందర్‌కూ జారీ చేసింది. 15 రోజుల్లో కమిషన్ ఎదుట హాజరుకావాలని పేర్కొంది. కాళేశ్వరం ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన బ్యారేజీలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రి, ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో వారిద్దరికీ కమిషన్ నోటీసులు జారీ చేసింది. కేసీఆర్ జూన్ 5న, హరీశ్‌రావు జూన్ 6న, ఈటల రాజేందర్ జూన్ 9న విచారణకు హాజరుకావాలని పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో దీంతోపాటు– అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ జరిపేందుకు న్యాయ విచారణ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో ఏర్పా–టైన ఈ కమిషన్.. నిర్మాణం, నిర్వహణ, డిజైన్, క్వాలిటీ–కంట్రోల్, పే అండ్ ఎకౌంట్స్, నీటిపారుదల, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణసంస్థల ప్రతినిధులు.. ఇలా అందరినీ విచారించింది. ఎప్పటికప్పుడు అవసరానికి తగ్గట్లుగా ప్రభుత్వం 7 సార్లు కమిషన్ గడువును పొడిగించింది. గత నెలాఖరులో ఒక నెల మాత్రమే

వివరాలు 2లో

# రాజ్‌భవన్ చోరీ కేసులో ట్విస్ట్

- హార్డ్ డిస్క్ చోరీలో శ్రీనివాస్ హస్తం
- మార్ఫింగ్ ఫోటోలు డిలీట్ చేసేందుకే శ్రీనివాస్ యత్నం
- ఎలాంటి ఫైళ్లు మాయం కాలేదని పోలసుల గుర్తింపు



**హైదరాబాద్,20(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన రాజ్‌భవన్ చోరీ కేసులో మరో ట్విస్ట్ బయటపడింది. తోటి మహిళా ఉద్యోగిని ఫోటోలు మార్ఫింగ్ చేసి రాజభవన్ ఉద్యోగి భయభ్రాంతులకు గురిచేసినట్లు పోలీసు లు విచారణలో బయటపడింది. రాజ్‌భవన్‌లో చోరీ కేసులో నిందితుడిని పంజాగుట్ట పోలీసులు రెండుసార్లు అరెస్ట్ చేశారు. మార్ఫింగ్ ఫొటో విషయంలో మొదటి సారి అరెస్ట్ చేయగా.. రెండో సారి రాజభవన్‌లోని హార్డ్ డిస్క్ చోరీ కేసులో నిందితుడిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సస్పెండ్ అయినప్పటికీ సెక్యూరిటీ–ని మాయ చేసి నైట్ –టైంలో ఎంట్రీ– ఇచ్చినట్లు– పోలీసులు గుర్తించారు. అయితే ఆ ఉద్యోగి వారంలో రెండు సార్లు అరెస్ట్ కావడం సంచలనం రేపుతోంది.

వివరాలు 2లో



## 17 నెలలు..17 ప్రధాన పథకాలు

**హైదరాబాద్,20(పిసిడబ్ల్యూ న్యూస్):**ప్రజా ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు పూర్తైన సందర్భంగా 17 ప్రధాన పథకాలపై పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పోస్టర్ విడుదల చేశారు. 17 నెలల పాలనలో అమల్లోకి తెచ్చిన 17 ప్రధాన సంక్షేమ పథకాల కరపత్రాలను గాంధీభవన్ లో ఆవిష్కరించారు. టిపిసిసి కార్యదర్శి బోడు రాకేష్ కుమార్ రూపొందించిన ఈ కరపత్రాలను రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం కోసం పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ పోస్టర్లను వినియోగించనున్నారు. 'తెలంగాణలో ప్రజా ప్రభుత్వం 17 నెలల పాలనలో సంక్షేమం' అనే పేరున ఈ పోస్టర్లను పిసిసి అధ్యక్షుడు విడుదల చేశారు. **17 ప్రధాన పథకాలు ఇలా...**

వివరాలు 2లో

# భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యం

- జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూముల సర్వే
- కొత్తగా 6 వేల మంది సర్వేయర్ల నియామకం
- భూభారతి చట్టంతో భూయజమానులకు హక్కు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



**పెద్దపల్లి,20(పిసిడబ్ల్యూ న్యూస్):**భూ సమస్యల శాశ్వత పరిష్కరారానికి కొత్తగా భూ భారతి చట్టం తీసుకొచ్చామని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జూన్ రెండవ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా భూముల సర్వేలు ప్రారంభం అవుతాయని, ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలో రెవిన్యూ సమస్యలన్నీ పరిష్కారం చేస్తామని తెలిపారు. అందుకోసం 6 వేల మంది సర్వేయర్లను కొత్తగా నియమిస్తున్నట్లు– చెప్పారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోటలో భూ భారతి రెవిన్యూ అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రతి సర్వే నెంబర్ ను తెలిపేలా భూములకు భూదార్ కార్డులు ఇస్తామని ఈ సందర్భంగా చెప్పారు. భూ సమస్యల పరిష్కారం కోసం అధికారులు గ్రామాల్లోకి వచ్చి సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో పేద వారిని ఇబ్బంది పెట్టకుండా రెవిన్యూ అధికారులు పని చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో ప్రతి నిరుపేదకు

వివరాలు 2లో



## గల్జార్‌హౌజ్ అగ్ని ప్రమాదం

- ప్రమాదాలపై ఐదుగురు అధికారులతో కమిటీ
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**హైదరాబాద్,20(పిసిడబ్ల్యూ న్యూస్):**హైదరాబాద్ చార్మినార్ పరిసర ప్రాంతాల్లో గుల్జార్ హౌజ్ వద్ద ఈ నెల 18న జరిగిన అగ్ని ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో పాటు–, ఆరుగురు ఉన్నతాధికారులతో కూడిన ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ నిర్ణయం నేపథ్యంలో హైదరాబాద్

వివరాలు 2లో

## మినీ అంగన్‌వాడీల జీతాలు పునరుద్ధరించాలి

- పెంచిన జీతాలు ఎలా తగ్గిస్తారో చెప్పాలి
- తెలంగాణ రైజింగ్ అంటే ఇదేనా..?
- సిఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ



**హైదరాబాద్,మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):**మినీ అంగన్వాడీ కార్యకర్తలను అంగన్వాడీలుగా గుర్తించి పూర్తి జీతం చెల్లించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. అంగన్వాడీలుగా గుర్తించి ఏడాది దాటినా కాంగ్రెస్ ప్రభుత్వం వారికి ఇప్పటికీ పెరిగిన జీతం ఇవ్వలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ఇచ్చిన జీవోను కాపీ కొట్టి రేవంత్ సర్కార్ ప్రచారం చేసుకున్నదని మండిపడ్డారు. మూడు నెలలు మాత్రమే పెంచిన జీతం ఇచ్చి గతేడాది కాలంగా వారిని పాత జీతానికే పని చేయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జీతాన్ని రూ. 13,650 నుంచి తిరిగి రూ. 7,800కి తగ్గించడం దారుణమని, బహుశా పెంచిన జీతాలను

వివరాలు 2లో

## చట్టం ముందు అందరూ సమానమే...

- కాళేశ్వరం విచారణకు కెసిఆర్ హాజరు కావాలి
- మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్య



**పెద్దపల్లి,మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):** కాళేశ్వరం ప్రాజెక్ట్ విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట కేసీఆర్ హాజరు కావాలని,వివరాలు వెల్లడించాలని తెలంగాణ ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. నోటీసులు ఇప్పుడే కదా ఇచ్చింది.. ఆయన వెళ్తారనే తాను అనుకుంటున్నానన్నారు. అయితే చట్టం ముందు అందరూ సమానమేనని ఆయనని చెప్పారు. కేసీఆర్‌కు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో శ్రీధర్ బాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం పెద్దపల్లిలో మంత్రి శ్రీధర్ బాబు విలేకర్లుతో మాట్లాడుతూ.. తప్పు చేయకపోతే భయం ఎందుకు అంటూ బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు. కాళేశ్వరంలో తనపై కేసీఆర్

వివరాలు 2లో

## 17 నెలలు..17 ప్రధాన పథకాలు

(మొదటి పేజీ తరువాయి)

రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్,రూ. 600లకే గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్య శ్రీ, రాజీవ్ యువ వికాసం, మూసీ ప్రక్షాళన, 63,310 ప్రభుత్వ ఉద్యోగాలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్స్, వర్గీకరణ, ఫ్యూచర్ సిటీ వైపు అడుగులు, హెల్త్ యూనివర్సిటీలు తదితర వాటిని ఈ 17 నెలల కాలంలో ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది.

## గల్జార్‌హౌజ్ అగ్ని ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ, ప్రభుత్వ చర్యలపై స్పష్టతనిచ్చారు. ఈ విచారణ కమిటీకి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురశెట్టి, సీపీ సీవీ ఆనంద్, ఫైర్ డీజీ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి ముషారఫ్ వంటి కీలక పదవులలో ఉన్న అధికారులను నియమించారు. ఈ కమిటీ బాధ్యత, గుల్జార్ హౌజ్ అగ్ని ప్రమాదం జరిగిన కారణాలు, ఘటన అనంతరం తీసుకున్న చర్యలు తదితర అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయడం. కేవలం కారణాలపై నివేదిక తయారు చేయడమే కాకుండా, భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ప్రజలకు ఎలా అవగాహన కల్పించాలి, క్షేత్రస్థాయిలో ఎలాంటి మార్పులు చేయాలి వంటి విషయాలపై కమిటీ- స్పష్టమైన ప్రతిపాదనలు సమర్పించనుంది. ఘటనపై నివేదిక అందిన అనంతరం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటారని మంత్రి పొన్నం వెల్లడించారు. ప్రజల ప్రాణాలు విలువైనవని, భద్రత విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వదని ఆయన స్పష్టం చేశారు. ఇటు-వంటి ఘటనలపై సున్నితంగా స్పందించడమే కాకుండా, తక్షణమే పరిష్కార మార్గాలు అన్వేషించడంలో రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతను ఈ కమిటీ- ఏర్పాటు- ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు.

## చట్టం ముందు అందరూ సమానమే...

(మొదటి పేజీ తరువాయి)

పెట్టిన కేసులు ఎదుర్కొన్నానని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తన తప్పేం లేదంటూ కేసును కోర్టు కొట్టేసిం దన్నారు. ఎనిమిదేళ్ల పాటు.. ఈ కేసులతో పోరాడానని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. మరోవైపు గత కేసీఆర్ ప్రభుత్వం లక్షల కోట్లాది రూపాయలు వెచ్చించి కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించింది. అయితే 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ ప్రాజెక్ట్‌లోని కొన్ని పిల్లర్లు కుంగాయి. ఈ నేపథ్యంలో దీనిని నాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రచారాస్త్రంగా మలుచుకొంది. తాము అధికారంలోకి వస్తే.. దీనిపై విచారణ జరిపిస్తామని ప్రకటించింది. ఇక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు పట్టం కట్టారు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం కొలువు తీరింది. జస్టిస్ పిసి ఘోష్ సారథ్యంలో కమిషన్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు- చేసింది.

## హైదరాబాద్‌లో మరో అగ్నిప్రమాదం

**హైదరాబాద్,మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):**నగరంలో మరో అగ్నిప్రమాదం జరిగింది. నగరంలోని ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఓ భవనం రెండో అంతస్తులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. భారీగా మంటలు ఎగసిపడుతుండటంతో దట్టంగా పొగ కమ్ముకుంది. మంటలు చెలరేగడంతో భవనంలోని నివాసితులు వెంటనే కిందకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైరింజన్లతో మంటలను అదుపు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు. కాగా, రెండు రోజుల క్రితం పాతబస్తీలో భారీ అగ్నిప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ఒకే కుటు-ంబంలోని 17మంది ప్రాణాలు కోల్పోయారు.

## వికారాబాద్ ప్రమాదంపై సిఎం దిగ్భ్రాంతి

**హైదరాబాద్,మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):**వికారాబాద్ జిల్లా రంగాపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స, తక్షణ సహాయక చర్యలను అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. మృతుల కుటు-ంబాలకు ఆయన సానుభూతి తెలియజేశారు. కాగా, వికారాబాద్ జిల్లాలోని పరిగి మండలం రంగాపూర్ సమీపంలో ఇవాళ (మంగళవారం) తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న వారిలో నలుగురు మృతి చెందగా, 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు పరిగి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



## కాళేశ్వరం కమిషన్ దూకుడు

(మొదటి పేజీ తరువాయి)

గడువు పొడిగించింది. దీనిప్రకారం ఈ నెలాఖరుకు కమిషన్ గడువు పూర్తికావాలి. ఈ నెల 21న లేదా 22న జస్టిస్ పీసీ ఘోష్ తుది నివేదికను ప్రభుత్వానికి అందజేస్తారనే ప్రచారం జరిగింది. అయితే విచారణలో.. సీనియర్ ఇంజినీర్లు, అధికారుల్లో ఎక్కువమంది గత ముఖ్యమంత్రి సమక్షంలో నిర్ణయాలు జరిగాయని, ఆయన ఆదేశాల మేరకే పలు నిర్ణయాలను అమలుచేశామని చెప్పిన నేపథ్యంలో.. వీటిపై కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌ల అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలనే నిర్ణయంతో కమిషన్ ఉన్నట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాళేశ్వరం నిర్మాణం వ్యవహారం లో నిజాన్ని నిగ్గు తేల్చాల్సిందిగా జస్టిస్ పీసీ ఘోష్ అధ్యక్షతన కమిషన్‌ను ఏర్పాటు- చేసింది. దాదాపు ఏడాదిన్నరగా కమిషన్ విచారణ కొనసాగుతోంది. కమిషన్ విచారణ గడువు ఈ నెలాఖరితో ముగియనుంది. అయితే కమిషన్ గడువును ప్రభుత్వం మరో రెండు నెలలపాటు అంటే జూలై 31 వరకు పొడిగిచింది. కమిషన్ విచారణలో భాగంగా బ్యారేజీ నిర్మాణంలో పనిచేసిన ఏఈలు, డీఈలు, ఎస్ఈలతో పాటు- రాష్ట్ర స్థాయి అధికారులందరినీ కమిషన్ విచారించింది. వారి నుంచి అఫిడవిట్లరూపంలో వాంగ్మూలాన్ని స్వీకరించి.. వాటిని క్రాస్ ఎగ్జామిన్ చేయడంతో పాటు- బహిరంగంగా విచారించింది. ప్రాజెక్టులను నిర్మించిన కంపెనీల ప్రతినిధులను కూడా విచారించింది. అలాగే ప్రాజెక్ట్ డిజైన్లు చేసిన కంపెనీల ప్రతినిధులను కూడా కమిషన్ విచారణ చేసింది. ఈ ఏడాది పాటు- సుదీర్ఘంగా జరిపిన ఈ విచారణలో దాదాపు అందరూ కూడా కేసీఆర్ పేరే చెప్పినట్లు తెలుస్తోంది. బ్యారేజీకి సంబంధించిన స్థలాల ఎంపికను ఎవరు చేశారని ప్రశ్నించగా.. ప్రధానంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పేరునే ప్రస్తావించినట్లు- సమాచారం. స్థలాల ఎంపిక, బ్యారేజీలకు సంబంధించి కీలక నిర్ణయాలు, చెల్లింపుల నిర్ణయాల్లో కూడా ఆనాటి సీఎం కేసీఆర్, అప్పటి ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ ప్రమేయంతో జరిగినట్లు- ప్రాథమిక నిర్ధారణకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ వచ్చినట్లు- తెలుస్తోంది. అలాగే కాళేశ్వరం కమిషన్ విచారణ దాదాపు తుది దశకు చేరుకుంది. ఇప్పటి వరకు వచ్చిన వివరాలతో ఓ నివేదికను కూడా సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌ను క్రాస్ ఎగ్జామినేషన్ చేయకుండా నివేదిక ఇస్తే బీఆర్ఎస్ తప్పుడు సంకేతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉందని భావించిన కమిషన్.. కేసీఆర్‌ను స్వయంగా విచారించాలని నిర్ణయించింది. అందులో భాగంగానే కేసీఆర్ సహా హరీష్, ఈటలకు నోటీసులు పంపించింది. అయితే కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరవుతారా లేక న్యాయపరంగా ఎదుర్కుంటారా అనేది చర్చనీయాంశంగా మారింది.

## రాజ్‌భవన్ చోరీ కేసులో ట్విస్ట్

(మొదటి పేజీ తరువాయి)

రాజ్ భవన్‌లో ఉద్యోగం చేస్తున్న శ్రీనివాస్ తన తోటి మహిళకు కొన్ని మార్ఫింగ్ ఫోటోలను చూపించాడు. ఎవరో తనకు ఈ ఫోటోలు పంపిస్తున్నాడు జాగ్రత్త అని చెప్పాడు. ఇంకా చాలా ఫోటోలను తన సిస్టంకు కూడా పంపించాడని భయపెట్టాడు. దీంతో కలవరానికి గురైన మహిళ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు..ఆ మార్ఫింగ్ ఫోటోలను శ్రీనివాస్ పంపించాడని తేల్చారు. దీంతో వెంటనే శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి వారం కింద రిమాండ్‌కు పంపారు. ఈ ఘటనతో రాజ్‌భవన్ అధికారులు శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశారు. జైలుకు వెళ్లిన శ్రీనివాస్ రెండు రోజుల తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాడు.జైలు నుంచి వచ్చిన అతడు రాత్రి సమయంలో సెక్యూరిటీని మభ్యపెట్టి లోపలికి వెళ్ళాడు. తన కంప్యూటర్‌లో ఉన్న హార్డ్ డిస్క్‌ను చోరీ చేసుకుని వెళ్ళిపోయాడు. ఈ సంఘటనపై పోలీసులకు రాజభవన్ అధికారులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన అధికారులు సీసీ కెమెరాల ద్వారా శ్రీనివాస్ చోరీని గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసిన పోలీసులు హార్డ్ డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ హార్డ్ డిస్క్‌లో మహిళకు సంబంధించిన ఫోటోలు ఉండడంతో ఆ సాక్ష్యాలను డిలీట్ చేసే ప్రయత్నంలో చోరీకి పాల్పడ్డాడని తెలిసింది. దీంతో శ్రీనివాస్‌ను పోలీసులు రెండో సారి జైలుకు పంపారు. తొలుత రాజ్‌భవన్‌లో జరిగిన చోరీ కీలక హార్డ్ డిస్క్‌లు, ఫైళ్లు మాయం అయినట్లు- ప్రచారం జరిగింది. అయితే ఫైళ్ల మాయంపై పంజాగుట్ట ఏసీపీ మోహన్ కుమార్ వివరణ ఇచ్చారు. రాజ్ భవన్‌లో పనిచేసే ఓ మహిళ.. తన ఫోటోలను ఐటీ- ఉద్యోగి శ్రీనివాస్ మార్ఫింగ్ చేసినట్లు- తెలిపారు. మహిళ ఫిర్యాదు మేరకు ఈనెల 12న శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని.. ఈ ఘటన తర్వాత శ్రీనివాస్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారన్నారు. మార్ఫింగ్ చేసిన ఫోటోలు, వీడియోలు ఉన్న హార్డ్ డిస్క్‌ల కోసం శ్రీనివాస్ మళ్ళీ రాజ్ భవన్‌కు 14న వచ్చాడని.. హెల్మెట్ ధరించి హార్డ్ డిస్క్‌లను దొంగలించా డన్నారు. దీనిపై దర్యాప్తు చేసి శ్రీనివాస్‌పై మరో కేసు నమోదు చేశామని.. 15న అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామని తెలిపారు. రాజ్ భవన్‌లో ఎలాంటి డాక్యుమెంట్లు-, ఫైల్స్ చోరీ అవ్వలేదని.. రాజ్ భవన్‌లో ఎలాంటి బయట వ్యక్తుల చోరీ జరగలేదని ఏసీపీ మోహన్ కుమార్ స్పష్టం చేశారు.

## భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇస్తుందని భరోసా ఇచ్చారు. ప్రతి నియోజకవర్గానికి సంవత్సరానికి 3 వేల 5 వందల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం దేశానికే ఆదర్శమని ఐటీ- శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. భూ భారతి రెవిన్యూ అవగాహన సదస్సులో పాల్గొన్న ఆయన.. గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రజలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేసిందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఆర్థిక వ్యవస్థ బాగాలేకున్న సంక్షేమ పథకాలను ఎక్కడా ఆపడం లేదన్నారు. పేదవారిని ఇబ్బంది పెట్టకుండా రెవిన్యూ అధికారు లు పని చేయాలని ఆదేశించారు. ఎన్నికల హామిలో భాగంగా ధరణి స్థానంలో భూభారతీ రెవిన్యూ చట్టం తీసుకొచ్చామని.. రాష్ట్రం నిధుల లేమితో సతమత మవుతున్న ఆర్థిక వ్యవస్థను దారిలో పెడుతున్నామని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ మోడీ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు విజయ రమణారావు, రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

## కుట్రపూరితంగా నోటీసులు

- కెసిఆర్‌కు నోటీసులపై కవిత

**హైదరాబాద్,మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నుంచి నోటీసులు జారీ అయిన నేపథ్యంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా స్పందించారు. ఈ నోటీ-సులను ఖండిస్తూ ఆమె తన అధికారిక సోషల్ మీడియా ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఈ సందర్భంగా ఆమె, ప్రజల కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన ప్రజానాయకుడు కేసీఆర్ కి రాజకీయ దురుద్దేశంతో, కుట్రపూరితంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. అది కాళేశ్వరం కమిషన్ కాదు... కాంగ్రెస్ కమిషన్ అని మరోసారి తేటతెల్లమైందని అన్నారు. కాళేశ్వరం ప్రజా ప్రయోజనాల కోసం నిర్మించిన బృహత్ ప్రాజెక్టు. తెలంగాణ ప్రజల తరతరాల దాహార్తిని తీర్చడానికి, తెలంగాణ పొలాల్లోకి గోదావరి నీళ్లను గళగళా తరలించడానికి కట్టిన ప్రాజెక్టు. తాను కలలు గన్న తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా తీర్చిదిద్దడానికి కేసీఆర్ గారు కట్టిన ప్రాజెక్టే కాళేశ్వరం అంటూ తెలిపారు. ఇది రాజకీయ కక్షతో, కుట్రతో ఇచ్చిన ఈ నోటీ-సులు, వేసిన కమిషన్లు కాలక్రమంలో తప్పకుండా న్యాయాన్ని గెలిపిస్తాయి. నిజాలన్నీ బయటకు వస్తాయని, రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటు-నాట్లు- ఆమె రాసుకొచ్చారు. చూడాలి మరి నేడు జారీ అయినా నోటీ-సులకు ఎలాంటి సమాధానాలు ఇవ్వబోతున్నారో నాయకులు. ప్రజల కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన ప్రజానాయకుడు కేసీఆర్ గారికి రాజకీయ దురుద్దేశంతో, కుట్రపూరితంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు- చేసిన కాళేశ్వరం కమిషన్ నోటీ-సులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను.

## కాళేశ్వరం కమిషన్ నోటీసులు

### హుటాహుటిన కెసిఆర్‌ను కలిసిన హరీష్ రావు

**గజ్వేల్,మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):**కాళేశ్వరం విచారణ కమిషన్ నోటీసులు జారీచేసిన నేపథ్యంలో హుటాహుటిన హరీష్ రావు ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో కెసిఆర్‌ను కలిసారు సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ను మాజీ మంత్రి హరీశ్‌రావు కలిశారు. కాళేశ్వరం కమిషన్ నోటీసుల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. జూన్ 5న విచారణకు రావాలని కేసీఆర్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీ-సులు జారీ చేసిన సంగతి తెలిసిందే. కేసీఆర్‌తోపాటు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌కు కూడా కమిషన్ నోటీసులిచ్చింది. కాళేశ్వరం ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన బ్యారేజీలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ చేస్తోంది. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రి, ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో వారికి కమిషన్ నోటీ-సులు జారీ చేసింది. కేసీఆర్ జూన్ 5న, హరీశ్‌రావు జూన్ 6న, ఈటల రాజేందర్ జూన్ 9న విచారణకు హాజరుకావాలని పేర్కొంది.మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో దీంతోపాటు- అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ జరిపేందుకు న్యాయ విచారణ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో ఏర్పా-టైన ఈ కమిషన్.. నిర్మాణం, నిర్వహణ, డిజైన్, క్వాలిటీ-కంట్రోల్, పే అండ్ ఎకౌంట్స్, నీటిపారుదల, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణసంస్థల ప్రతినిధులు.. ఇలా అందరినీ విచారించింది.

## మినీ అంగన్‌వాడీల జీతాలు పునరుద్ధరించాలి

(మొదటి పేజీ తరువాయి)

తగ్గించే కొత్త సాంప్రదాయానికి తెర లేపిన రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదేమోనని ఎద్దేవా చేశారు. అన్నింటా తెలంగాణ రైజింగ్ అని చెబుతూ అంగన్వాడీల జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు లేఖ రాశారు. జనవరి 2024 నుంచి 12 నెలలకు పెరిగిన జీతాలు పూర్తి స్థాయిలో చెల్లించాలని డిమాండ్‌చేశారు. అంగన్వాడీ కేంద్రాలుగా మారిన ప్రతీ చోట హెల్పర్లను నియమించాలన్నారు. మే నెల పెరిగిన జీతాలు అందని జిల్లాల్లో తక్షణమే చెల్లించాలన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న మహిళల కడుపు కొడుతున్నారని మండిపడ్డారు. మే నెల జీతాన్ని 8 జిల్లాల్లో మాత్రమే ఇచ్చి మిగతా జిల్లాల వారికి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మినీ అంగన్వాడీలు ప్రచార సాధనాలు కాదని, వారికి నిజమైన గౌరవం ఇవ్వాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మినీ అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న మానసిక వేదన, వారి కుటుంబాలు ఎదుర్కొంటు-న్న ఇబ్బందుల గురించి మీ దృష్టికి తీసుకురాదలిచాను. రాష్ట్రవ్యాప్తంగా 3,989 మంది మినీ అంగన్వాడీ కార్యకర్తలున్నారు .వీరంతా మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అత్యంత పేదవర్గాలకు అంకితభావంతో సేవలు అందిస్తున్నారు. మినీ అంగన్వాడీ కార్యకర్తల కష్టాలను గుర్తించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 సెప్టెంబర్ 5న వారికి అంగన్వాడీలుగా పదోన్నతి కల్పిస్తూ జీవో జారీ చేసింది. అయితే, ఎన్నికల కోడ్ కారణంగా ఈ ఉత్తర్వులు అమలు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీతక్క.. మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి మినీ అంగన్వాడీలను అంగన్వాడీలుగా గుర్తిస్తూ మొదటి సంతకం చేసిన సంగతి మీకు తెలిసే ఉంటుంది. 2023 డిసెంబర్ 15న ఇదే విషయంపై జీవో కూడా జారీ చేశారు. కానీ, అది గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో. దాన్నే తిరిగి కొత్తగా ప్రచారం కోసం విడుదల చేసి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేశారు. 2024 జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలలు అంగన్వాడీ పే గ్రేడ్‌లో రూ.13,650 జీతం చెల్లించిన ప్రభుత్వం, ఆ తర్వాత మినీ అంగన్వాడీ జీతం రూ.7,800కి తగ్గించి, 2025 ఏప్రిల్ వరకు అదే జీతం చెల్లించింది. ఈ విధంగా, మూడు నెలలు అంగన్వాడీలుగా గుర్తించి, తిరిగి సంవత్సర కాలం మినీ అంగన్వాడీ జీతాలతో పనిచేయించడంతో వీరి కుటుంబాలకు తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురిచేసింది. బహుశా పెంచిన జీతాలను తగ్గించే కొత్త సాంప్రదాయానికి తెర లేపిన రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదేమో! అన్నిట్లో తెలంగాణ రైజింగ్ అని చెబుతూ అంగన్వాడీల జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మినీ అంగన్వాడీలు తమ హక్కుల కోసం మంత్రిని, అధికారులను అనేకసార్లు కలిసినా, ప్రభుత్వం స్పందించలేదు. బీఆర్ఎస్ పార్టీ ఈ విషయంపై ప్రశ్నించిన తర్వాత, 2025 ఏప్రిల్‌లో మళ్లీ పాత జీవోను తిరిగి విడుదల చేస్తూ, మినీ అంగన్వాడీలను అంగన్వాడీలుగా గుర్తిస్తున్నామని ప్రచారం చేసుకున్నారు.ఒకే పనికి రెండు సార్లు జీవోలు జారీ చేసి, రాజకీయ ప్రచారం చేసుకోవడం తప్ప, మినీ అంగన్వాడీలకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పి మరీ మహిళలను మోసం చేశారు. కోటి మంది మహిళలను కోటీ-శ్వరులను చేస్తామని మోసం, రాష్ట్రంలో ప్రతి మహిళకు 2,500 రూపాయలు ఇస్తామని మోసం, మహిళలను పారిశ్రామిక వేత్తలుగా మారుస్తానని మోసం, లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు ఇస్తామని మోసం, కల్యాణ లక్ష్మితో పాటు- తులం బంగారం ఇస్తామని మోసం, చదువుకునే ఆడపిల్లలకు స్కూటీ-లు ఇస్తానని మోసం, అంగన్వాడీలకు 18,000 నెలసరి జీతం పెంచుతామని మోసం, మినీ అంగన్వాడీలను అంగన్వాడీలను చేస్తామని మోసం. ఇలా కాంగ్రెస్ మహిళలకు చేసిన మోసాల లిస్ట్ రాస్తే చాంతాండంత అవుతుందన్నారు.

## పెంచిన మెట్రో ఛార్జీల్లో స్వల్పంగా తగ్గింపు

**హైదరాబాద్,మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):** నగర వాసులకు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ గుడ్ న్యూస్ చెప్పింది. ఇటీవల మెట్రో చార్జీలను భారీగా పెంచిన యాజమాన్యం కాస్తా దిగొచ్చింది. తాజాగా మెట్రో రైలు సంస్థ టికెట్ ధరలను సవరించింది. మంగళవారం మెట్రో చార్జీలను తగ్గిస్తున్నట్లు- ప్రకటించింది. పెంచిన ధరలపై 10 శాతం చార్జీలను తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తగ్గించిన టికెట్ ధరలను మే 24వ తేదీ నుండి అమలులోకి తీసుకురానున్నట్టు- వెల్లడించింది. కాగా, ఇటీ-వల కనిష్టంగా ఉన్న రూ.10 టికెట్ ధరను 12 రూపాయలకు పెంచింది. గరిష్టంగా ఉన్న 60 రూపాయల టికెట్ ధరను 75 రూపాయలకు పెంచిన సంగతి తెలిసిందే.



# నవచేతన బుక్ హౌస్‌లో పుస్తక ప్రదర్శన ప్రారంభం




**హనుమకొండ, మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ అశోక కాంప్లెక్స్ లోని నవచేతన బుక్ హౌస్ లో మంగళవారం పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. వేసవి సెలవుల సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పిల్లల పుస్తక ప్రదర్శనను నవచేతన విజ్ఞాన సమితి గవర్నింగ్ బాడీ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తుందని, ప్రతి ఒక్కరూ పుస్తకాలను నిరంతరం కొనసాగించాలని అన్నారు. ఈ పుస్తక ప్రదర్శనలో వివిధ రకాల పబ్లిషర్స్, రచయితలు, కవుల పుస్తకాలు అందుబాటులో ఉంచడం జరిగిందని, అన్ని రకాల పుస్తకాలపై 10% నుండి 30% శాతం వరకు ప్రత్యేక తగ్గింపు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పుస్తక ప్రదర్శన జూన్ నెల 10 వరకు కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని విద్యాసంస్థలు, మేధావులు, విద్యార్థులు సద్వినియోగము చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అరసం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్ నారాయణ, సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, నవచేతన బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు, టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, నాయకులు ఏదునూరి వెంకట్రాజం, దండు మోహన్, ఎండి ఉస్మాన్ పాషా, తాండూరి గోపి, పి. కిషోర్ కుమార్, సిబ్బంది రమేష్, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ బస్సు ఓనర్స్ అసోసియేషన్ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులుగా లక్కం శ్రీధర్ ఎన్నిక





**హనుమకొండ, మే 20(పీసీడబ్ల్యూ న్యూస్):** హన్మకొండ ఏనుగులగడ్డ లో జరిగిన ప్రైవేట్ బస్సు అసోసియేషన్ ఎన్నికలు జరుగగా అధ్యక్షులుగా లక్కం శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా పెరుమాండ్ల అనిల్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రలకు వెళ్లే బస్సులకు పన్ను మినహాయింపు కోసం కృషి చేస్తామని, ప్రవైట్ విద్యసంస్థల బస్సులను శుభకార్యలయాలకు వెళ్లకుండా అరికడుతాం అని అన్నారు. మంగళవారం జరిగిన నూతన కమిటి లో ఉపాధ్యక్షులుగా చింతలపూడి క్రాంతికుమార్, కోశాధికారిగా అనిశెట్టి శ్యామ్ కమిటీ సభ్యులు గా మార్క కొటేష్, కొత్త కిరణ్ కుమార్, పట్నంశెట్టి శైలేష్ ప్రసాద్, ఎండి ఫిరోజ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

## దివ్యాంగుడు బొక్క మనోహర్‌కి వీల్ చైర్ అందజేసి అండగా నిలిచిన ఎమ్మెల్యే నాగరాజు



**హన్మకొండ, మే 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** హన్మకొండ సుబేదారి లోని ఎమ్మెల్యే నివాస క్యాంపు కార్యాలయం నందు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ ముచర్ల గ్రామానికి చెందిన బొక్క మనోహర్ ఇటీవల పక్షవాతంతో కాళ్ళు, చేతులు పడిపోగా.., మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అతనికీ వీల్ చైర్ అందజేసి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా పిసిసి అబ్జర్వర్ మాక్సూద్ అహ్మద్, కాంగ్రెస్ నాయకులు , సహృదయ వృద్ధాశ్రమ చైర్మన్ మహమ్మద్ యాకూబ్ - చోటే, హన్మకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి, ఆత్మకూర్ మార్కెట్ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, హసన్పర్తి మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, మదన్ గౌడ్, శ్రీరాం, గొర్రె కిరణ్, ముచేర్ల గ్రామ కాంగ్రెస్ నాయకులు మట్టెడ భరత్, తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి ప్రాణాలు బలిగొన్న మహిళ కారు డ్రైవింగ్ సరదా

**• ఒకరు మృతి, ఒకరి పరిస్థితి విషమం**

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పరిధిలోని నవ్య కాలనీకి చెందిన మహేశ్వరి అనే మహిళ, కారు నేర్చుకునేందుకు సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో భర్త రవిశేఖర్ తో కలిసి సమీపంలో ఉన్న నర్రెగూడెం గ్రౌండుకు వెళ్ళింది. అదే సమయంలో గ్రౌండులో ఆడుకునేందుకు వచ్చిన శేఖర్, అనురాధ దంపతుల పిల్లలు మణిధర్ వర్మ (10), ఏకవాణి (12) కారు డ్రైవింగ్ నేర్చుకునే క్రమంలో అదుపు తప్పి పిల్లలపైకి దూసుకెళ్లడంతో ఇద్దరు చిన్నారులు కారు చక్రాల కింద నలిగిపోయారు దీంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన బాలుడు మణిధర్ వర్మ. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏకవాణి. చిన్నారుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు.



## అపర్ణ సోషల్ సర్వీస్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో.. దాతృత్వం(అన్నదానం)



**హనుమకొండ, మే 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** తినడానికి తిండి, ఉండడానికి గూడు లేక ప్రధాన రోడ్ల మీద ఏకాకిగా జీవిస్తున్న అనాధలకు మంగళవారం అపర్ణ సోషల్ సర్వీస్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమకొండ, ఫాతిమా నగర్, కాజీపేట, రైల్వే స్టేషన్ లో అన్నం కోసం ఎదురుచూస్తున్న ఎంతోమంది అన్నార్తులకు అన్నదానం చేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా అపర్ణ సోషల్ సర్వీస్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు బొచ్చు అపర్ణ మాట్లాడుతూ.. మానవత్వంతో సేవ చేయడం అనేది.. దైవ సంకల్పం అని, ఇలాంటి అనార్తులను ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బొచ్చు నరేష్, సొసైటీ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో పెళ్ళికొడుకు మృతి



**బయ్యారం,మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని గౌరారం పంచాయతీ పరిధిలో కోడిపుంజుల తండలో విషాదం చోటుచేసుకుంది. విద్యుత్ షాక్ తో పెళ్ళికొడుకు ఇస్లావత్ నరేష్ (26) మంగళవారం మృతి చెందాడు. బయ్యారం ఎస్ఐ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఎన్టీఆర్ జిల్లా కంకి పాడు గ్రామంలో వధువు ఇంట్లో వివాహం చేసుకొని,వరుడు స్వగ్రామం బయ్యారం మండలం కోడిపుంజుల తండాకు వచ్చి (రీసెప్షన్) ఏర్పాటు పనులలో నిమగ్నమై ఉండగా నీటి కోసం బావి వద్దకు వెళ్లి మోటారు ఆన్ చేసే క్రమంలో విద్యుత్ ప్రమాదానికి గురై ఇస్లావత్ నరేష్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులు, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. దీనితో ఆ గ్రామంలో విషాదం ఛాయలు అలుముకున్నాయి. వివాహం జరిగి 48 గంటలు గడవకముందే వరుడు విద్యుత్ ప్రమాదానికి గురై మరణించడంతో రీసెప్షన్ కు వచ్చిన బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కాళ్ళ పారాణి ఆరక ముందే భర్త మృతదేహన్ని చూసి వధువు జాహ్నవి ప్రియ ఆపస్మారక స్థితిలోకీ పోవడంతో హుటాహుటిన వైద్యం నిమిత్తం బంధువులు మహబూబాబాద్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

# హజరత్ షేర్ అలీ బాబా దర్గా అభివృద్ధికి కృషి చేస్తా...

**• దర్గా కమిటీ బాధ్యులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి హామీ.**



**తిమ్మాపూర్,మే20(పీసీడబ్ల్యూ న్యూస్):** తీగల వంతెన సమీపంలోని హాజరత్ షేర్ అలీ బాబా దర్గా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో తనకు కలిసేందుకు వచ్చిన దర్గా కమిటీ బాధ్యలకు ఈ మేరకు ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దర్గా అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానన్నారు. దర్గా నుండి కేబుల్ బ్రిడ్జి రోడ్డుకు స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేస్తానని, దర్గా ఆవరణలో మినీ హైమాస్ట్ లైట్లు మంజూరు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అంతేకాకుండా మిగతా అభివృద్ధి పనులను గుర్తించి వాటిని సైతం మంజూరు చేయించి పూర్తి చేసే విధంగా అధికారులను ఆదేశిస్తానని ఆయన చెప్పారు. అంతకు ముందు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు దర్గా కమిటీ ద్వారా ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యే వివరించడమే కాకుండా దర్గా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అజరత్ షేర్ అలీ బాబా దర్గా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ వాజిద్ అలీ, ప్రధాన కార్యదర్శి నదీముద్దీన్, ఉపాధ్యక్షుడు ఎండి. ఇర్ఫాన్ మొహియుద్దీన్, అయూబ్ ఖాన్, సంయుక్త కార్యదర్శులు మీర్జా యూసుఫ్ బేగ్, ఎండి. సలీం, కోశాధికారి అలీ, సలహాదారులు మౌలానా అలీముద్దీన్ నిజామి,లయిఖ్ ఎంఎ సలాం, సభ్యులు ఫహీం, మూసా తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడికి చికిత్స నిమిత్తం ఎల్ఓసిని అందజేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హన్మకొండ, మే 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 43వ డివిజన్ తిమ్మాపూర్ రాంగోపాలపురం గ్రామానికి చెందిన ఎడ్ల నరసింహ రామయ్య గుండె శస్త్ర చికిత్స కోసం నిమ్స్ హాస్పిటల్ లో చేరడంతో స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వారికి చికిత్స కొరకు రూ. 2,00,000 రూపాయల ఎల్ఓసి మంజూరు చేయించి, మంగళవారం ఎమ్మెల్యే హన్మకొండ సుబేదారి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో బాధితుడి కుటుంబ సభ్యునికి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఎల్ఓసి కాపీ అందజేశారు. ఈ సందర్భంగా చికిత్స కొరకు ఎల్ఓసి మంజూరు చేయించిన ఎమ్మెల్యే నాగరాజుకి వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా శ్రీ హనుమాన్ శోభాయాత్ర

**చిట్యాల, మే 20 (పీసీడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని చింతలపల్లి, చిట్యాల. రాంనగర్ కాలనీలో హనుమాన్ భక్తుల శ్రీ హనుమాన్ శోభాయాత్ర శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి శ్రీ రామనామ స్మరణతో చిట్యాల పులకరించింది. ఉదయం 4.30 గంటలకు చింతలపల్లి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం నుండి ప్రారంభమైన శోభయాత్ర చిట్యాల చౌరస్తా, చిట్యాల గ్రామపంచాయతీ, రాంనగర్ కాలనీ వీధుల మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. శ్రీఈ పవిత్ర కార్యక్రమానికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. శ్రీ హనుమంతుని అనుగ్రహాన్ని పొందగలరని మనసారా కోరుకున్నారు. హనుమాన్ మాలధారణ స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని నగరసంకీర్తన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తహసిల్దార్ విజయను కలిసి సన్మానించిన ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి



**కురవి, 20మే(పిసిడబ్ల్యూ న్యూస్):** మండల తహిసిల్దార్ గా నూతనంగా వచ్చిన విజయ ను మరిపెడ డివిజన్ ఆత్మ చైర్మన్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. మండలంలోని ధాన్యపు కొనుగోలు సెంటర్లలో త్వరితగతిన ధాన్యం బస్తాల తరలింపు జరగాలని, అకాల వర్షాలతో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న తురక రమేష్‌లు పాల్గొన్నారు.

## మీల్స్ కాలనీ ఇన్స్ స్పెక్టర్ వెంకట రత్నంను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ



**హనుమకొండ, మే 20(పీసీడబ్ల్యూ న్యూస్):** ఓ భూ వివాదం కేసులో బాధితులకు న్యాయం చేయకుండా, తప్పుడు కేసును నమోదు చేయడమే కాకుండా ఈ కేసులో మరణించిన వ్యక్తి పేరును కూడా నమోదు చేసి నిందితులకు సహకరించినందుకు అలాగే మరో కేసులో మహిళ నిందితురాలిని, పోలీస్ స్టేషన్ ఆవరణలో లైంగిక వేధింపులకు గురి చేసిట్లుగా విచారణలో నిర్ధారణ కావడంతో మీల్స్ కాలనీ ఇన్స్ స్పెక్టర్ ను సస్పెండ్ చేస్తూ.. వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

**- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):** కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ప్రజా వాణిలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణిలో 44 దరఖాస్తులు రాగా రెవిన్యూ సమస్యలతో పాటు హౌసింగ్, డిపిఓ, ఎలక్ట్రిసిటి , డీఆర్ డిఓ శాఖల కు చెందిన అర్జీలు ఉన్నాయి.ప్రజావాణీ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్,మాధురి, డిఆర్ఓ పద్మజ రాణి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు ,ఆర్ డి ఓ లు , పాల్గొన్నారు.

## సూదుల అవసరం లేకుండా రక్త పరీక్షలు

**- నీలోఫర్ ఆసుపత్రిలో అరుదైన ప్రయోగం**




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):**దేశంలో తొలిసారిగా సూదుల అవసరం లేకుండా రక్తపరీక్షలు చేసే AI ఆధారిత పరికరాన్ని హైదరాబాద్‌లో నిలోఫర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. క్విక్ వైటల్స్ అభివృద్ధి చేసిన ఫొటో ప్లెథిస్మోగ్రఫీ (పీపీజీ) ఆధారిత ఈ పరికరం ముఖాన్ని స్కాన్ చేసి ఒక నిమిషంలో BP, ఆక్సిజన్, హార్ట్‌బీట్, శ్వాసక్రియ, ఒత్తిడి, హిమోగ్లోబిన్ తదితర వివరాలు తెలియజేస్తుంది. మొదట 1000 మంది పిల్లలపై టెస్ట్ చేయనున్నారు.

## తెలంగాణ రాజ్‌భవన్ చోరీ కేసులో ట్విస్ట్

**- రాజ్‌భవన్‌లో చోరీకి పాల్పడింది మాజీ ఉద్యోగే**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):**ఓ మహిళా ఉద్యోగి ఫొటోలను మార్ఫింగ్ చేసిన కేసులో గతంలో అరెస్ట్ అయిన శ్రీనివాస్ అనే ఉద్యోగి.. అప్పట్లోనే అతడిని ప్రభుత్వం సస్పెండ్ చేయగా.. బెయిల్‌పై బయటకొచ్చాక హెల్మెట్‌తో రాజ్‌భవన్‌లోకి వచ్చి.. తాను వాడిన సిస్టమ్‌లోని మహిళ మార్ఫింగ్ ఫొటోలు ఉన్న హార్డ్ డిస్క్‌ను చోరీ చేసిన శ్రీనివాస్ .చోరీ చేసిన హార్డ్ డిస్క్‌లో ఎలాంటి కీలక సమాచారం లేదు శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపిన పోలీసులు

## వడ దెబ్బతో వధువు తండ్రి మృతి



**బయ్యారం,మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):** మండలంలోని గంధంపల్లి కొత్తపేట పంచాయతీ పరిధిలో ఇంట్లో పెండ్లి చేసి పెళ్లి పనుల నిమిత్తం బిజీ బిజీ గా ఎండలో తిరగడం వల్ల వడదెబ్బ తగిలి, మంగళవారం జంగిలి సతీష్ (45) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జంగిలి సతీష్ చిన్న కూతురు వివాహ వేడుక ఈ నెల 18 న జరిపారు. తర్వాత రోజు నుండి అనారోగ్యానికి గురి కావడంతో సోమవారం మహబూబాబాద్ లో ఓ ప్రయివేటు ఆసుపత్రికి బంధువులు తరలించి వైద్యం అందిస్తుండగా వడదెబ్బతో మంగళవారం మృత్యువాత పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీనితో నవవధువు కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్నాయి.వివాహ వేడుక సంబరాలు ఆ ఇరువురి కుటుంబంలో శోకాన్ని మిగిల్చాయని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు మృతుడి కీ భార్య ఇద్దరు కూతుళ్ళు ఉన్నారు.

# అగర్వాల్ కంటి హస్పిటల్ ఆధ్వర్యంలో.. ఉచిత కంటి శిబిరం

**● ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యం..**

**● ప్రజా పాలనలో సంక్షేమం దిశగా తెలంగాణ రాష్ట్రం ● ప్రజా ఆరోగ్యం పై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి, నాడ్కైనా...నేడ్కైనా ..ఏనాడ్కైనా సదా మీ సేవలోనే కాంగ్రెస్ ● అగర్వాల్ కంటి హస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు బిర్రు రాజు**



**హనుమకొండ, మే 20(పీసీడబ్ల్యూ న్యూస్):** అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా నిత్యం ప్రజా సేవలోనే ఉంటానని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బిర్రు రాజు అన్నారు. మంగళవారం మండలంలోని నల్లబెల్లి గ్రామంలో డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో బిర్రు రాజు ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు తెచ్చుకున్న పాలన మార్పుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నదని అన్నారు. గత పాలనలో రాష్ట్రంను అధోగతి పాలు చేసినా ఆ సమస్యలన్ని ఒక్కొక్కటికి పరిష్కరిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేరుస్తూ ప్రజా పాలన సాగుతున్నదని అన్నారు. ప్రతిపక్షాలు ఉన్ని కుట్రలు కుతంత్రాలు చేసి సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేయాలని చూసినా ప్రజాక్షేత్రంలో ప్రజల మద్దతు కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉంటుందని రాజు అన్నారు. చిత్త శుద్ధి కలిగిన ప్రతి పార్టీ కార్యకర్త ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను తప్పికోట్టాలని రాజు స్థానిక పార్టీ కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, నాయకులకు విజ్ఞప్తి చేశారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని విజయాలను అందుకునేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్ళాల్సిన అవసరం ఉందని అన్నారు.గత పాలనలో భూ కబ్జాలతో చిన్నాబిన్నమైన వర్ధన్నపేట నియోజకవర్గం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎమ్మెల్యే నాగరాజు ఆధ్వర్యంలో అభివృద్ధి దిశగా పరుగులు పెడుతున్నదని అన్నారు. గత పదేళ్లలో నియోజకవర్గంలో ఏక్కడా కానరాని డబుల్ బెడ్ రూం ఇళ్లను అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర పాలనలోనే ప్రజలకు ఇచ్చిన హామీలను, బీద ప్రజలకు నేటీ ఆధునిక సమాజంలో అన్ని సౌకర్యాలు ఉండేలా పక్కా ఇళ్లను నిర్మిస్తున్న విషయాన్ని రాజు గుర్తు చేశారు. అధే విధంగా ధరణి అనే దరిద్రంతో ఎంతో మంది సామాన్యులకు భూ సమస్యలను తెచ్చిపెట్టిన బీఆర్ఎస్ పాలన అంతం కాగానే భూ భారతితో శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని అన్నారు. మంగళవారం నల్లబెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్షల శిబిరంలో గ్రామానికి చేందిన సుమారు 150 మంది ప్రజలు వినియోగించుకున్నట్లు రాజు తెలిపారు. వీరిలో 50 మందికి కంటి పరీక్షలు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. వీరందరికి వారం రోజుల్లో కంటి వైద్య నిపుణుల ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్ చేయించనున్నట్లు నిర్వాహకులు బిర్రు రాజు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలోనల్లబెల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాటికాయల దిలీప్, ఇల్లంద మార్కెట్ డైరెక్టర్ మల్యాల దేవేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిరగోని యాదగిరి, బిర్రు చంద్రయ్య బిర్రు భాస్కర్, వెంకన్న, సంపత్ రెడ్డి గుండేటి శివాజీ బిర్రు సురేష్ బిర్రు రమేష్ పరశరాములు లోహిత భాస్కర్ గోలి కుమారస్వామి లోహిత ప్రభాకర్ కుమారస్వామి బిర్రు అరుణ్ ఆరెల్లి నాగరాజు నూనె హరీష్ పురుగుజ వినీత్ తో పాటు అగర్వాల్ కంటి హస్పిటల్ డా. హరికృష్ణ, శైలేజ, మేనేజర్ నృతాగాని లక్ష్మీనారాయణ, మదాసీ రమేష్, సిబ్బంది తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఓరుగల్లులో కాకతీయ 22వ మహారాజ్ శ్రీ కమల్ చంద్ర భంజ్ దేవ్ కాకతీయ పర్యటన

**హనుమకొండ, మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ తో కలిసి భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది కమల్ చంద్ర భంజ్ దేవ్ కి పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆయన పోచమ్మ మైదాన్ సెంటర్లోని మహారాణి రుద్రమదేవి విగ్రహానికి పూలమాలలు వేసి. నివాళులు అర్పించారు. ఖిలా వరంగల్ కోటలోని స్వయంభు శంభు లింగేశ్వర ఆలయంలోని శివునికి ప్రత్యేక పూజలు చేశారు. చతుర్ముఖ శివలింగానికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం వేయి స్తంభాల ఆలయంలోని రుద్రేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు అర్చనలు నిర్వహించి ప్రత్యేక పూజ కార్యక్రమాలు పాల్గొన్నారు.అనంతరం రెడ్డిపురంలోని టార్చ్ సంస్థ వ్యవస్థాపకులు అరవింద్ ఆర్య ఇంటిని సందర్శించారు.**మీట్, గ్రీట్ కార్యక్రమ నిర్వహణ..** నక్కలగుట్ట లోని హరిత కాకతీయ కాన్ఫరెన్స్ హాల్లో.... ఓరుగల్లు నగర ప్రజలతో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు మహారాజును





పలు విషయాలపై వారితో చర్చించారు. సంస్కృతి సాంప్రదాయాలను ప్రతి ఒక్కరు కాపాడుకోవాలని కోరారు. ప్రపంచానికి విజ్ఞానాన్ని, సాంప్రదాయాలను, సంస్కృతిని పరిచయం చేసిన మహోన్నత దేశం భారతదేశం అని అన్నారు. ప్రపంచ దేశాలకు భాష లిపి లేనప్పుడే మనం భాష ను, లిపిని ఉపయోగించామని తెలిపారు. ఓరుగల్లులో నిర్మించనున్న విమానాశ్రయానికి రాణి రుద్రమదేవి పేరు పెట్టాలని గతంలోనే ప్రధాని నరేంద్రమోదీ ని కోరినట్టు తెలిపారు. కాకతీయుల సంపద అయిన కోహినూరు వజ్రాన్ని సైతం బ్రిటన్ నుంచి తెప్పించే ప్రయత్నం చేయాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు. భారతదేశ, తెలంగాణ పురాతన కట్టడాలను, వారసత్వ సంపదలను పరిరక్షించి భావితరాలకు అందించాలని కోరానని వివరించారు. వారసత్వ సంపదను, మన సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందని అన్నారు. భావితరాలకు మన సంస్కృతిని, సాంప్రదాయాలను, వారసత్వ సంపదను, చారిత్రాత్మక కట్టడాలను, దేశ చరిత్ర గురించి తెలపాల్సిన అవసరం ఉందని అన్నారు. మన ఆచార వ్యవహారాలను మనమే కాపాడుకోవాల్సి ఉంటుందని, బస్తర్ దసరా పండుగను 72 రోజులపాటు నిర్వహిస్తామని అన్నారు.

# హిందూ ఏక్తా యాత్ర ఏర్పాట్లను పర్యవేక్షించిన బిజెపి నాయకులు...

**● మే 22న జరిగే " హిందూ ఏక్త యాత్ర"ను విజయవంతం చేయండి... ● బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...**

**కరీంనగర్,మే20(పీసీడబ్ల్యూ న్యూస్):** హనుమాన్ జయంతి రోజున కేంద్ర మంత్రి, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో చేపడుతున్న " హిందూ ఏక్తాయాత్ర ఏర్పాట్ల ను మంగళవారం రోజున కరీంనగర్లోని వైశ్య భవన్ వద్ద బిజెపి శ్రేణులతో కలిసి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గంగా డి కృష్ణారెడ్డి నాయకులు కార్యకర్తలకు ఏక్తాయాత్ర పై పలు సూచనలు చేసి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22న జరగబోయే హిందూ ఏక్తాయాత్రను కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అత్యంత వైభవంగా నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకున్నారని తెలిపారు. పార్టీలకతీతంగా, హిందూ బంధువులు అందరూ, యువత మహిళలు హిందూ ఏక్తాయాత్ర కు తరలిరానున్నారని తెలిపారు. ప్రప్రదమంగా కరీంనగర్లో 13 సంవత్సరాల క్రితం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమైన హిందూ ఏక్తా యాత్రకు రాష్ట్రవ్యాప్తంగా ఎంతో గుర్తింపు, ప్రాధాన్యత వచ్చిందని తెలిపారు. ప్రతి ఏటా హనుమాన్ జయంతి రోజున కరీంనగర్ పట్టణంలో అత్యంత వైభవంగా జరుగుతున్న హిందూ ఏక్తాయాత్ర నేడు హిందువుల సంఘటితశక్తి, ఐక్యతకు దిక్సూచిగా మారిందని పేర్కొన్నారు. హిందూ ఏక్తాయాత్ర మరింతవైభవంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. కరీంనగర్ పట్టణంలోని





వైశ్య భవన్ నుండి సాయంత్రం నాలుగు గంటలకు యాత్ర ప్రారంభమై, పట్టణంలోని పలు ప్రాంతాల మీదుగా యాత్ర కొనసాగుతుందని తెలిపారు.రాజకీయాలకతీతంగా ప్రజలు, హిందూ ధర్మం గురించి ఆలోచించే సమాజం, యువత స్వచ్ఛందంగా యాత్రకు హాజరై విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల ఆంజనేయులు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిలపు రమేష్ , సీనియర్ నాయకులు కన్నబోయిన ఓదెలు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, బండ రమణారెడ్డి, దండు కొమరయ్య, మాజీ కార్పొరేటర్లు పెద్దపల్లి జితేందర్, వంగల పవన్, సతీష్ , దుర్శెట్టి అనూప్ , మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయ శ్రీ , అసెంబ్లీ కన్వీనర్ దూబల శ్రీనివాస్, లడ్డు ముందాడా, చిట్టి కరుణాకర్, అడిచెర్ల రాజు, తనకు సాయి, అవదుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి జలాల తరలింపు రాజ్యాంగ విరుద్ధం

**● తెలంగాణ స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ చలకాని వెంకట్ యాదవ్**

**గార్ల, మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):** గోదావరి పరివాహక ప్రాంతంగా ఉన్న ఏజెన్సీ, ఆదివాసి గిరిజన ప్రాంతాల ప్రజలకు త్రాగు, సాగు నీరు ఇవ్వకుండా ఖమ్మం జిల్లాలోని కృష్ణా బేసిన్ కు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను తరలించడం రాజ్యాంగ విరుద్ధమని తెలంగాణ స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్, ప్రముఖ న్యాయవాది చలకాని వెంకట్ యాదవ్ అన్నారు. మంగళవారం గార్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్లో గోదావరి జల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన గోదావరి జలాల అవగాహన సదస్సులో చలకాని వెంకట్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీతారామ ప్రాజెక్ట్ రీడిజైన్ జీవో నెంబర్ 72, మున్నేరు నీళ్లను పాలేరుకు తరలించే జీవో నెంబర్ 98 లు అసంబద్ధమైన, రాజ్యాంగ విరుద్ధమైన జీవోలని ఆయన పేర్కొన్నారు. ఈ రెండు జీవోల రద్దు కోరుతూ గోదావరి జల సాధన సమితి తరపున తెలంగాణ హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆదివాసి ప్రాంతాల అభివృద్ధి కోసం కేటాయించిన ప్రాజెక్టులను, నిధులను మైదాన ప్రాంతాలకు లేదా అభివృద్ధి చెందిన ప్రాంతాలకు తరలించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆదివాసి ప్రాంతాల్లో నెలకొన్న అనేక మౌలిక సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసి గిరిజన ప్రాంతాలకు సాగు త్రాగు నీరు అందించి వ్యవసాయాన్ని



అభివృద్ధి పరుస్తూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించినట్లయితే నక్సలైట్ల సమస్య తగ్గుతుందన్నారు. దీనికి భిన్నంగా ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు వెచ్చించి సాయుధ బలగాలతో మావోయిస్టులను, ఆదివాసులను అణచివేయడం సమస్యకు పరిష్కారాన్ని చూపదని తెలిపారు. ఆదివాసి ప్రాంతాలకు కేటాయించిన అభివృద్ధి నిధులు దారి మళ్లకుండా ప్రభుత్వమే తగిన చర్య తీసుకుంటూ ఆదివాసి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో జరిగిన తెలంగాణ ఉద్యమం తెలంగాణ వచ్చిన తర్వాత నీళ్ల కోసం, నిధుల కోసం వివిధ ప్రాంతాలు ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. ఆదివాసి గిరిజన ప్రాంతాల పట్ల ప్రభుత్వాల వివక్ష పూరిత నిర్లక్ష్యానికి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ప్రత్యక్ష ఉదాహరణ అని ఆయన అన్నారు. మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఉమ్మడి సరిహద్దుగా ఉన్న ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్ ఆదివాసి గిరిజన నియోజకవర్గాల అభివృద్ధి పట్ల ప్రభుత్వం, స్థానిక మంత్రులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. 50 సంవత్సరాలుగా మున్నేరు ప్రాజెక్ట్ పెండింగ్లో ఉండగా మున్నేరు ప్రాజెక్టును నిర్మించకుండా, ఈ ప్రాంత ప్రజలకు సాగు త్రాగు నీరు ఇవ్వకుండా మున్నేరు నీటిని నాగార్జున సాగర్ ఆయకట్టుగా ఉన్న పాలేరుకు తరలించడం కుట్రపూరిత చర్యగా అభివర్ణించారు. ఆదివాసి, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రాజ్యాంగం కట్టుబడి ఉన్నప్పటికీ పాలకులు ఆదివాసి గిరిజన ప్రాంతాల పట్ల సవతి తల్లి ప్రేమను చూపడం సమంజసం కాదన్నారు. గోదావరి జలసాధన సమితి చేస్తున్న న్యాయమైన పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు ఆయన తెలిపారు.గోదావరి జల సాధన సమితి చైర్మన్ విశ్వ జంపాల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గోదావరి జల సాధన సమితి నాయకులు, అఖిలపక్ష నేతలు మల్లెల రామనాథం, కట్టెబోయిన శ్రీనివాస్, గుండా వెంకటరెడ్డి, ధనియాకుల రామారావు, గుగులోత్ సక్రు, పానుగంటి రాధాకృష్ణ, వజ్రం నాగేశ్వరరావు, కత్తి సత్యం, గిన్నారపు మురళి తారక రామారావు, భూక్య హరినాయక్, అజ్మీర వెంకన్న, మాలోత్ మాన్య నాయక్, చిలక నరసయ్య, అంకెపాక కిరణ్, మల్లేల బిక్షపతి, చింతల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదుల చర్యలను పసిగట్టడంలో కేంద్రం విఫలం

**● మతోన్మాద విధానాలతో లౌకికత్వానికి ప్రమాదం ● ఎంసిపిఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్**

**నర్సంపేట, మే 20(పీసీడబ్ల్యూ న్యూస్):** దేశంలో ఉగ్రవాదుల పన్నాగాలను పసిగట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని ఈ క్రమంలోనే పహెల్గాంలో పర్యటకులపై ఉగ్రవాదుల పైశాచిక దాడి జరిగిందని ఎంసిపిఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య)- ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశం కామ్రేడ్ షేక్ నజీర్ అధ్యక్షతన వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతంలోని ఓంకార్ భవన్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కామ్రేడ్ మద్ది కాయల అశోక్ ఓంకార్ మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వ విధానాల వల్ల కార్మికులు కర్షకులు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆదాని అంబానీ లాంటి పెట్టుబడుదారులు ఎదేచ్ఛగా దేశ సంపదను అనుభవిస్తున్నారని శ్రమజీవులకు ఎలాంటి కనీస సౌకర్యాలు తగిన



విధంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు మరోవైపు భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి దేశ లౌకికత్వాన్ని సమగ్రతను దెబ్బతీసేందుకు మతపరమైన విధానాలకు చర్యలు చేపట్టడం ఆందోళన కలిగిస్తున్నదని ఎస్సీ ఎస్టీ బీసీ సామాజిక తరగతులకు తీరని నష్టం జరుగుతున్నదని అలాగే దేశాన్ని రక్షించాల్సిన కీలక బాధ్యతను నిర్వర్తించాల్సిన పాలకులు అది విస్మరించి తగిన విధంగా భద్రతను ఏర్పాటు చేయకుండా, నియామకాలు చేపట్టకుండా, ఉగ్రవాదులు పర్యాటకుల ప్రాణాలు బలి కొనడానికి కారణమయ్యారని ఆరోపించారు ఏ లక్ష్యం లేకుండానే పాకిస్తాన్ పై యుద్ధం ప్రకటించి ఎంతో సాధించామని ప్రకటించుకోవడం సిగ్గుచేటు అన్నారు ఏ రకమైన మతోన్మాదం అయినా ప్రజలకు తీవ్రమైన హాని కలిగిస్తుందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వామపక్ష సామాజిక ప్రజా సంఘాలు రాజకీయాలకతీతంగా ప్రజలను సమీకరించి ఉద్యమాలను చేపట్టేందుకు శ్రీకారం చుట్టాలని అందులో ఎంసిపిఐ(యు) కార్యకర్తలు ముందు ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశానికి ముందు ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన పర్యటకుల మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి వనం సుధాకర్ కుంభం సుకన్య వసుకుల మట్టయ్య వరికుప్పల వెంకన్న గోనె కుమారస్వామి పెద్దారపు రమేష్ ఎన్ రెడ్డి హంసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో మినీ అంగన్వాడీ కార్యకర్తలు ఛిద్రం చేసిన ముఖ్యమంత్రి

**● మానసిక వేదన అనుభవిస్తున్న మినీ అంగన్వాడీ కార్యకర్తలు, వారి కుటుంబాలు: ఎమ్మెల్యే హరీష్ రావు**

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 20(పిసిడబ్ల్యు న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా 3,989 మంది మినీ అంగన్వాడీ కార్యకర్తలున్నారు .వీరంతా మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అత్యంత పేదవర్గాలకు అంకితభావంతో సేవలు అందిస్తున్నారు. మినీ అంగన్వాడీ కార్యకర్తల కష్టాలను గుర్తించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 సెప్టెంబర్ 5న వారికి అంగన్వాడీలుగా పదోన్నతి కల్పిస్తూ జీవో జారీ చేసింది. అయితే, ఎన్నికల కోడ్ కారణంగా ఈ ఉత్తర్వులు అమలు కాలేదు .కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దనసరి సీతక్క మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి మినీ అంగన్వాడీలను అంగన్వాడీలుగా గుర్తిస్తూ మొదటి సంతకం చేసిన సంగతి మీకు తెలిసే ఉంటుంది. 2023 డిసెంబర్ 15న ఇదే విషయంపై జీవో కూడా జారీ చేశారు. కానీ, అది గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో. దాన్నే తిరిగి కొత్తగా ప్రచారం కోసం విడుదల చేసి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేశారు. 2024 జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలలు అంగన్వాడీ పే గ్రేడ్లో రూ.13,650 జీతం చెల్లించిన ప్రభుత్వం, ఆ తర్వాత మినీ అంగన్వాడీ జీతం రూ.7,800కి తగ్గించి, 2025 ఏప్రిల్ వరకు అదే జీతం చెల్లించింది. ఈ విధంగా, మూడు నెలలు అంగన్వాడీలుగా గుర్తించి, తిరిగి సంవత్సర కాలం మినీ అంగన్వాడీ జీతాలతో పనిచేయించడంతో వీరి కుటుంబాలకు తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురిచేసింది. బహుశా పెంచిన జీతాలను తగ్గించే కొత్త సాంప్రదాయానికి తెర లేపిన రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదేమో! అన్నిట్లో తెలంగాణ రైజింగ్ అని చెబుతూ అంగన్వాడీల జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసం?మినీ అంగన్వాడీలు తమ హక్కుల కోసం మంత్రి



గారిని, అధికారులను అనేకసార్లు కలిసినా, ప్రభుత్వం స్పందించలేదు. బీఆర్ఎస్ పార్టీ ఈ విషయంపై ప్రశ్నించిన తర్వాత, 2025 ఏప్రిల్లో మళ్లీ పాత జీవోను తిరిగి విడుదల చేస్తూ, మినీ అంగన్వాడీలను అంగన్వాడీలుగా గుర్తిస్తున్నామని ప్రచారం చేసుకున్నారు. అయినప్పటికీ, మే నెలలో కేవలం ఎనిమిది జిల్లాల్లోని మినీ అంగన్వాడీలకు మాత్రమే అంగన్వాడీ పే గ్రేడ్ జీతాలు చెల్లించి, మిగతా జిల్లాల వారికి జీతాలు చెల్లించలేదు. ఈ అస్పష్టత, అయోమయం వీరిని మరింత గందరగోళంలోకి నెట్టింది.ఒకే పనికి రెండు సార్లు జీవోలు జారీ చేసి, రాజకీయ ప్రచారం చేసుకోవడం తప్ప, మినీ అంగన్వాడీలకు ఎలాంటి న్యాయం జరగలేదు. మినీ అంగన్వాడీలు మీ ప్రచార సాధనాలు కాదు. గ్రామీణ తెలంగాణలోని పేద ప్రజలకు అంకితభావంతో సేవలు అందిస్తున్న కార్యకర్తలు. వారి కడుపు కొట్టడం, వారి కుటుంబాలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టడం అన్యాయం .కాంగ్రెస్ ప్రభుత్వం, సి ఎమ్ రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మినీ అంగన్వాడీల విషయంలోనే కాదు మహిళలను అన్ని విషయాల్లో మోసం చేస్తోంది .కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పి మరీ మహిళలను మోసం చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని మోసం, రాష్ట్రంలో ప్రతి మహిళకు 2,500 రూపాయలు ఇస్తామని మోసం, మహిళలను పారిశ్రామిక వేత్తలుగా మారుస్తానని మోసం, లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు ఇస్తామని మోసం, కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని మోసం, చదువుకునే ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తానని మోసం, అంగన్వాడీలకు 18,000 నెలసరి జీతం పెంచుతామని మోసం, మినీ అంగన్వాడీలను అంగన్వాడీలను చేస్తామని మోసం. ఇలా కాంగ్రెస్ మహిళలకు చేసిన మోసాల లిస్ట్ రాస్తే చాంతాండంత అవుతుంది .ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తాను విడుదల చేసిన జీవోను గౌరవించి జనవరి 2024 నుంచి మినీ అంగన్వాడీలకు పెంచిన జీతం చెల్లించాలి ఏడాదిగా పెండింగ్లో ఉన్న జీతాలను పూర్తి స్థాయిలో 3,989 మంది మినీ అంగన్వాడీలకు చెల్లించాలి.మినీ అంగన్వాడీ నుండి అంగన్వాడీ కేంద్రాలుగా మారిన చోట హెల్పర్లను వెంటనే నియమించాలి.మే నెల పెరిగిన జీతాలు అందని జిల్లాల్లో తక్షణమే అందరికీ జీతాలుచెల్లించాలి. మినీ అంగన్వాడీల ఆవేదనను అర్థం చేసుకుని సత్వరమే వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాను.

# పోలీస్ డిపార్ట్మెంట్ వారికి అభినందనలు

**- ఖమ్మం సిటీ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు ఎస్కే అబ్బాస్ బేగ్**



**ఖమ్మం, మే 20 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** సోమవారం ఖమ్మంలో భారతీయ జనతా పార్టీ నిర్వహించిన తిరంగా ర్యాలీ లో కొన్ని అవాంఛనీయమైన సంఘటనలు జరగటం వలన పోలీస్ డిపార్ట్మెంట్ వారు రెండు వర్గాల వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లడం జరిగింది. స్టేషన్లో ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చి ప్రశాంతమైన వాతావరణం తెచ్చారన్నారు. ఇలాంటి సంఘ టనలు మళ్ళీ పునరావతం కాకుండా ఉండేటట్టు ఉండాలని ఇరువార్గాలకు చెప్పి పంపించడం జరిగిందన్నారు . దీనికి గాను ఖమ్మం పోలీస్ డిపార్ట్మెంట్ వారికి ఖమ్మం సిటీ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు ఎస్కే అబ్బాస్ బేగ్ అభినందనలు తెలిపారు.

# దళిత విద్యార్థిని కులం పేరుతో దూషించి కొట్టిన వారిని కఠినంగా శిక్షించాలి

**- రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య**



**చిట్యాల, మే 20 (పీసీడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి గుర్రపు రాజేందర్ తో కలిసి మాట్లాడారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపం లోని ఓ కళాశాలలో జేమ్స్ అనే దళిత విద్యార్థి బిటెక్ చివరి సంవత్సరం చదువుతున్న అతని అదే కళాశాలలో చదువుతున్న యశ్వంత్ నాయుడు కులం పేరుతో దూషిస్తూ తీవ్రంగా అవమా నించినాడని అలా కులం పేరుతో అవమానించ వద్దని అన్నందుకు జేమ్స్ పై కక్ష పెంచుకుని యశ్వంత్ నాయుడు రౌడీ షీటర్ రూపేష్, మరో రౌడీ షీటర్ కొందరి వ్యక్తులతో కలిసి కారులో కిడ్నాప్ చేసి పిడు గుద్దులు గుద్దుతూ కులం పేరుతో దూషిస్తూ హాకీ స్టిక్స్ తో పాటు రాడ్ల దాడి చేసి కత్తి తో తలపై గాయపరిచి మానవత్వం మంట గలిపి నా ట్టమూత్రం తాగించిన దుండగులను చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పలు శుభకార్యల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు మాదిరి ప్రిథ్వీరాజ్

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 20(పిసిడబ్ల్యు న్యూస్):** పటాన్‌చెరు మున్నూరు కాపు భవనంలో నిర్వహించిన రాజు గారి కుమార్తె పుట్టు పంచల కార్యక్రమంలో పాల్గొని కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు.నందిగామలోని YSR బాంకెట్ హాల్‌లో మిత్రుడు సంతోష్ కుమార్తె తొట్టెల కార్యక్రమంలో పాల్గొని చిన్నారికి ఆశీర్వచనాలు అందించారు. శంకరపల్లి మల్లికార్జున ఫంక్షన్ హాల్‌లో జరిగిన MDR యువసేన సభ్యుడు రోషన్ సోదరి వివాహ రిసెప్షన్‌లో పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.







# ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు పటిష్ట కార్యాచరణ

- హెచ్.ఐ.వి. ఎయిడ్స్ నియంత్రణ, తీసుకోవలసిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, మే 20 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో హెచ్.ఐ.వి, ఎయిడ్స్ నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. హెచ్.ఐ.వి. ఎయిడ్స్ నియంత్రణ పద్ధతుల పై అవగాహన కల్పన, హైరిస్క్ ఏరియాలో తీసుకుంటున్న చర్యలు, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ.. జిల్లాలో హెచ్.ఐ.వి. ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు ఎంత మంది సిబ్బంది ఉన్నారు, ఎన్ని స్వచ్ఛంద సంస్థలు ఉన్నాయి, ఎయిడ్స్ నియంత్రణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణపై వాటి పని తీరు, వివరాలను పర్యవేక్షించేందుకు వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. నెలకు ఒకసారి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించాలని, హెచ్.ఐ.వి. వ్యాధి విస్తరణ తగ్గాలంటే తప్పనిసరిగా ప్రికాషన్స్ చేపట్టాలని, నిరోధ్ ప్యాకెట్లు అందించడంతో పాటు వాటి వినియోగంపై కూడా అవగాహన కల్పించాలని అన్నారు. తల్లికి ఎయిడ్స్ వ్యాధి ఉన్నట్లు ముందుగానే తెలిస్తే బిడ్డకు వ్యాపించకుండా నిరోధించే అవకాశాలు ఉన్నాయ ని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ప్రదర్శించేలా చిన్న చిన్న వీడియోలు, ఫోన్ మెసేజ్ తయారు చేయాలని అన్నారు. నమోదవుతున్న కేసుల నియంత్రణకు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. హెచ్ఐవి ఎయిడ్స్ హెల్ప్ లైన్ 1097 పట్ల ప్రాచుర్యం కల్పించాలని ఆసుపత్రిలో రిసెప్షన్, మందుల షాపు, క్యాంటీన్ వంటి వివిధ ప్రదేశాలలో పాంప్లెట్ లను ఉంచాలని అన్నారు. స్వశక్తి మహిళా సంఘాలకు నిర్వహించే ఆరోగ్య సమావేశాల్లో. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందు లు రెగ్యులర్ గా అందించి వాడే విధంగా చూడాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బి. కళావతి బాయి, అడిషనల్ డి.ఎం.అండ్ హెచ్.ఓ. డా. పి. వెంకట రమణ, ఏ.ఆర్.టి. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్. పి. మోహన్ రావు, డేటా మేనేజర్ పి. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల సెక్రెటరీ నిర్వాకం పేద విద్యార్థులకు శాపం

- రాష్ట్రంలో 12 ఎస్సీ గురుకులాలలో ఇంటర్ విద్యకు సమాధి
- కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపు - రోడ్డనపడ్డ కుంటుంబాలు
- పిడిఎస్యు తెలంగాణ రాష్ట్ర సహాయకార్యదర్శి వెంకటేష్

**ఖమ్మం, మే 20(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** పేద విద్యార్థులకు ఉచిత వసతి, విద్యను అందించేం దుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన గురుకుల విద్యావ్యవస్థను బ్రష్టుపట్టిస్తూ ఇంటర్ కళాశాలలను తొలగించడం, అదేవిధంగా గత 12 ఏండ్లుగా గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను నిర్దాక్షణ్యంగా తొలగించడం దుర్మార్గమని తక్షణమే విదుల నుండి గురుకుల సెక్రటరీ అలుగు వర్షిణిని తొలగించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత(పిడిఎస్యు) తెలంగాణ రాష్ట్ర సహాయకార్యదర్శి వెంకటేష్, జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. పిడిఎస్యు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ గురుకులాల్లో ఇంటర్ విద్యను కొనసాగించాలని కోరుతూ మంగళవారం ఎస్సీ గురుకుల జోనల్ ఆఫీస్ ఏఆర్సిఓకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్, లక్ష్మణ్ లు మాట్లాడుతూ..ఈ గురుకులాల ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుకునే స్తోమత లేకనే ఎస్సీ గురుకులాల్లో చదువుకుంటున్నారు. ఆలాంటి విద్యార్థులకు ఇంటర్ విద్యను దూరం చేయడం సమంజసం కాదన్నారు. గురుకులాల్లో సెక్రెటరీ గా పనిచేసిన ఎవ్వరూ కూడా విద్యార్థులను విద్యకు దూరంచేసే ఇలాంటి దారుణ సంఘటనలకు పాల్పడలేదన్నారు. తక్షణమే గురుకుల సెక్రటరీ తొలగించాలని డిమాండ్ చేశారు. ముగ్గురు మంత్రులున్నటువంటి ఉమ్మడి జిల్లాలో కూసుమంచి, సత్తుపల్లి, భద్రాచలం కేంద్రంగా ఉన్నటువంటి ఇంటర్ గురుకులాలను తొలగించడం దారుణమని మంత్రులు నిద్రపోతున్నారా? అని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా మూసివేసిన12 ఎస్సీ గురుకులాల్లో విద్యను కొనసాగించాలని, తొలగించిన కాంట్రాక్ట్ ఉద్యోగులను విదుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పిడిఎస్యు జిల్లా నాయకులు యశ్వంత్, ప్రసాద్, పేరాల వెంకటేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# వయోవృద్ధుల సేవ దైవంతో సమానం

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. కళావతి బాయి
- పాలియేటివ్ కేర్ సెంటర్‌ను సందర్శించిన డిఎంహెచ్ఓ



**ఖమ్మం, మే 20 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** జిల్లా ప్రధాన ఆసుపత్రిలోని వయోవృద్ధుల కేర్ సెంటర్ ( పాలియేటివ్ కేర్ సెంటర్ ), క్యాన్సర్ బాధిత మహిళ పేషంట్ల వార్డులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. కళావతి బాయి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వయోవృద్ధుల కేంద్రంలో వున్న రోగులను పరామర్శించి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాలియేటివ్ కేర్ లో వున్న రోగులకు సేవలు చేయడమంటే ఆ దైవానికే సేవలు చేసినట్లుగా భావించాలని, ఈ స్థితిలో వున్నా ఇలాంటి పేషంట్లు ఇంటి దగ్గర ఉండడం వల్ల రోగులతో పాటు కుటుంబం సభ్యులకు కూడా మానసికంగా చాలా ఒత్తిడి ఉంటుందని, ప్రభుత్వం ప్రత్యేకంగా చివరి అవసాన దశలో వున్న పేషంట్ల కోసం పాలియేటివ్ కేర్ సెంటర్లను మానవతా దృక్పథంతో ఏర్పాటుచేసి, డాక్టర్, నర్సింగ్ ఆఫసర్లతో సేవలు అందిస్తున్నారన్నారు. కుటుంబ సభ్యులు కూడా పేషంట్ కు ఎప్పటికీ అందుబాటులో వుంటూ డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లతో పేషంట్ల వివరాలు, ఆరోగ్య పరిస్థితి, తగిన జాగ్రత్తలు తెలుసుకోవాలన్నారు. డాక్టర్, నర్సింగ్ స్టాఫ్ హాజరు పట్టిక, ఇన్ పేషంట్ల రిజిస్టర్, అందిస్తున్న సేవల వివరాలు, రోగుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి సమీక్షించారు. డాక్టర్ ప్రేమలత, గైనకాలంజస్ట్ లతో పేషంట్ల కేర్ గురించి చర్చించారు. ప్రధాన ఆసుపత్రిలో వున్న తెలంగాణ దయాగ్నొస్టిక్ హబ్ లో రోగులకు చేస్తున్న వివిధ రకాల పరీక్షల గురించి పర్యవేక్షణ చేశారు. క్యాన్సర్, షుగర్, బి.పి. పేషంట్లు క్రమం తప్పకుండా డాక్టర్లు ఇస్తున్న మందులు వాడుతూ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. పేషంట్లతో వచ్చిన 35 సంవత్సరాలు దాటిన కేర్ టేకర్లు కూడా అసంక్రమిత వ్యాధులు రాకుండా ముందస్తుగా పరీక్షలు చేయించుకుంటే క్యాన్సర్, బి.పి, షుగర్ లాంటి వ్యాధులను నివారించగలుగుతామని డిఎంహెచ్ఓ డాక్టర్ బి. కళావతి బాయి తెలిపారు.

# దేశ ద్రోహం కేసు నమోదు చేయాలి

- జాతీయవాదం పట్ల చిన్నచూపు తగదు
- శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల వైఫల్యం
- బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు



**ఖమ్మం, మే 20 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్న త్రివిధ దళాలు, ప్రధాని నరేంద్రమోడీలను కీర్తిస్తూ ఖమ్మం నగరంలో తిరంగ్ యాత్రను నిర్వహిస్తుంటే ఇద్దరు ముస్లిం యువకులు ర్యాలీని విచ్ఛిన్నం చేసే దిశగా దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని వారిపై దేశ ద్రోహం కేసు నమోదు చేయాలని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో బిజెపి జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో తిరంగ్ యాత్ర సందర్భంగా జరిగిన ఘటన గురించి ఆయన పలు విషయాలను వెల్లడించారు. సోమవారం నగరంలోని ట్యాంక్‌బండ్ నుండి సర్దార్ వల్లబాయ్‌పటేల్ స్టేడియ వరకు తిరంగ్ యాత్ర విజయవంతంగా సాగిందని, అందులో భాగంగా ఇల్లందు క్రాస్‌రోడ్డు వద్ద ఇద్దరు అన్యమతస్తులు ర్యాలీని అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో పోలీసులతో వాగ్వివాదం జరిగి జాతీయవాదులపై దుర్భషలాడటంతో పోలీసులు ఇద్దరు యువకులను పోలీసు స్టేషన్‌కి తరలించారని, అయితే ఇరువురు యువకులు కాస్తా 200 మందికి సమాచారం ఇచ్చి మత విద్వేషానికి కారణమయ్యారని ఆరోపించారు. ఈ క్రమంలో బిజెపి లీగల్ అడ్వయిజర్ వెంకట్ గుప్తా తన కుటుంబ సభ్యులను ఇంటికి పంపేందుకు బయటకు వెళ్లగా సుమారు 200 మంది మూకుమ్మడిగా దాడి చేశారని, ఈ సంఘటనతో పోలీసులు లాఠీ చార్జి నిర్వహించారని తెలిపారు. ఇద్దరు వ్యక్తుల అనాలోచిత శ్కెలి వలన మతాల మధ్య చిచ్చు ఏర్పడే పరిస్థితి ఏర్పడిరదని ఈ విషయంలో పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనబడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఈవీ.రమేష్, సన్నే ఉదయ్ ప్రతాప్, అల్లిక అంజయ్య, నంబూరి రామలింగేశ్వరరావు, రవి రాథోడ్, బెనర్జీ, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, దనియాకుల వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు టీ షర్టు పంపిణీ



**చిట్యాల , మే 20 (పీసీడబ్ల్యూ న్యూస్):** మెగా రెడ్ మిక్స్ హైదరాబాద్ వారి సౌజన్యంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని క్రికెట్ క్రీడాకారులకు గంగాధర్ రవీందర్ ఆధ్వర్యంలో టీ షర్ట్స్ పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో. కట్కూరి నరేందర్. ఇరుకులపాటి వినయ్ మాటూరి లవన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపెల్లి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు అక్బర్ అలీ నివాసంలో ఘనంగా జరిగిన జన్మదిన వేడుకలు...



**కరీంనగర్ జిల్లా మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):** పెద్దపెల్లి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు అక్బర్ అలీ జన్మదిన సందర్భంగా ఆయన నివాసం నగరంలోని హుస్సేనిపురలో ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకోవడం జరిగింది, ఈ వేడుకల్లో కరీంనగర్ సిటీ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అబ్దుల్ బారి మరియు కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ ఇర్షాద్, మహమ్మద్ లైఖ్, అల్తాఫ్, ఈసాముద్దీన్, మహమ్మద్ రైస్ పాల్గొన్నారు.

# మంత్రి సీతక్కకి పూల మొక్క అందించిన దైద వెంకన్న

**మహబూబాబాద్ మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):** వాల్ట్ చట్టం తెలంగాణ రాష్ట్ర నీరు. భూమి మరియు చెట్ల చట్టం టీజీ వాల్ట అథారిటీ సమావేశం మంగళవారం పంచాయితీరాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క అధ్యక్షతన తెలంగాణ సెక్రటేరియట్ లో తన ఛాంబర్లో జరిగింది. ఈ సమావేశానికి మనుకోటకు చెందిన ప్రకృతి ప్రేమికుడు దైద వెంకన్నకు అవకాశం దక్కింది. ఈ సమావేశాల్లో పలు అంశాల పై చర్చించారు.అనంతరం సీతాక్కకు ఆక్సీజన్ ఇచ్చే మొక్కను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు



# గజస్తంభ ప్రతిష్టాత్మక ఉత్సవాలకు హాజరైన భూపాలపల్లి ఎమ్మెల్యే





**రేగొండ, మే 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** రేగొండ మండలం గూడేపల్లి గ్రామంలో శ్రీ అభయ శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా గజ స్తంభ నవగ్రహ విగ్రహ ప్రతిష్టాత్మక ఉత్సవాలకు ఆలయ కమిటీ చైర్మన్ సిరికొండ రవీందర్రావు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు డింగరి వంశీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో గ్రామంలో మూడు రోజుల పూజల క్రమంలో భాగంగా ఈరోజు హెూమం కుంకుమార్చన చేయడం జరిగింది. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆంజనేయ స్వామి దర్శించుకుని అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భూపాలపల్లి



ఎమ్మెల్యే గండ సత్యనారాయణ రావు వచ్చి దేవుని దర్శనం చేసుకోవడం జరిగింది తను మాట్లాడుతూ పార్టీలకతీతంగా కలిసికట్టుగా గ్రామంలోని ప్రజలు చందాలు వేసుకొని గ్రామంలో గజ స్థంభం నిలుపుకోవడం చాలా మంచి పరిణామం అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పంచనేని వెంకటరావు, లింగంపల్లి తిరుపతిరావు, పోలుసాని శ్రీనివాసరావు, మోర్ కుమార్ మరి ఆంజనేయ స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అలుగునూర్ సిఓఇ బాలుర గురుకులాన్ని వేరే ప్రాంతానికి తరలించద్దు.. యధావిధిగా కొనసాగించాలి

• ఎస్ఎఫ్ఐ ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీలు



**కరీంనగర్,మే20(పీసీడబ్ల్యూ న్యూస్):** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ గేటు ఎదురుగా తిమ్మాపూర్ మండలం లోని అలుగునూర్ సి ఓ ఇ బాలుర గురుకులాన్ని వేరే ప్రాంతానికి తరలించవద్దని, ఉత్తమ విద్యను దూరం చేసే కుట్రను ప్రభుత్వం మానుకోవాలని ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, టి జి పి ఏ తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర నిజ నిర్ధారణ కమిటీ కన్వీనర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జీ దార మధు లు మాట్లాడుతూ అలుగునూర్ సి ఓ ఇ బాలుర హాస్టల్ ని వేరే ప్రాంతానికి తరలించవద్దని, విద్యార్థులకు ఉత్తమ విద్యను దూరం చేసే కుట్రను మానుకోవాలని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉత్తర తెలంగాణలో బెస్ట్ సెంట్రల్ ఆఫ్ ఎక్సెన్స్ గా అలుగునూర్ లోని విద్యాలయం రూపుదిద్దుకున్నది, గతంలో విద్యార్థులు సాధించిన మార్కులే స్పష్టంగా కనిపిస్తుంది, అట్లాంటి సి ఓ ఇ బాలుర గురుకులాన్ని వేరే ప్రాంతానికి తరలించడం అనేది విద్యార్థులని చదువులకు దూరం చేసే కుట్రగా ప్రత్యక్షంగా కనిపిస్తుంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కేవలం ఐదు ప్రదేశాల్లో ప్రైమ్ కళాశాలలుగా నడుస్తున్నది. రంగారెడ్డి జిల్లా లోని గౌలిదోడ్డి, కరీంనగర్ జిల్లా లోని అలుగునూర్ రెండు మంచి ర్యాంకులతో ఉత్తమ ఫలితాలతో రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నవి వాటిని జనరల్ కళాశాలలుగా మార్చవద్దు అని అన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న హయంలో 2006 లో సెంటర్ ఆఫ్ ఎక్సెన్స్ లోని ప్రారంభించాడు. వాటి మంచి ప్రమాణలతో కూడిన విద్య నీట్, ఎంసెట్ లో మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలను అందించే విధంగా సెంటర్ ఆఫ్ ఎక్సెన్స్ లో ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం సెంటర్ ఆఫ్ ఎక్సెన్స్ లకు ప్రత్యేక జీవో ని జారీ చేసి బాలురకు 70 శాతం బాలికలకు 30 శాతం గతంలో కేటాయించింది. కానీ బాలురకు 50 శాతం బాలికలకు 50 శాతం ఇప్పటి వరకు నడిపించారు. ప్రస్తుతం విద్యా వ్యవస్థను విద్యారంగానికి వ్యతిరేకంగా కేటాయించిన సీట్లను పూర్తిగా అమ్మాయిలకు కేటాయిస్తూ ప్రభుత్వం ప్రణాళికను రూపొందించింది దానిని ఎస్ఎఫ్ఐ ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు, టి జి పి ఏ తల్లి తండ్రుల సంఘం పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయి. ఎందుకంటే కో- ఎడ్యుకేషన్ విద్యలో విద్యార్థులు మంచి ప్రతిభతో వారు ర్యాంకులు సాధిస్తున్నారు. వారి ప్రతిభను చాటుతూ గొప్ప స్థాయిలో ఎదుగుతున్నారు. అట్లాంటి తరుణంలో బాలురలకు ఉత్తమ విద్యని దూరం చేసే కుట్రనే స్పష్టంగా ప్రస్తుతం చేస్తున్నట్టు కనిపిస్తుంది. కావున యధావిధిగా సి ఓ ఇ ని తరలించకుండా అల్గునూరులోనే నడిపించాలి. ప్రత్యేక వసతి గృహాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. జిల్లా ఎమ్మెల్యేలు దీనిపైన ఏమాత్రం కూడా స్పందించకుండా విద్యార్థులను విద్యారంగాన్ని వెన్నుపోటు పొడిచే విధంగా కనబడుతుంది. రాజకీయ బిక్ష పెట్టిన కరీంనగర్ ని ప్రస్తుతం మంత్రి పొన్నం ప్రభాకర్ విస్మరిస్తున్నారు. కరీంనగర్ రావాల్సిన ఇంజనీరింగ్ కళాశాలను హుస్నాబాద్ కు తరలించుకున్నాడు అదే విధంగా సెంటర్ ఆఫ్ ఎక్సెన్స్ లో కూడా అట్లాంటి ప్రయత్నాలు చేయడం చాలా బాధాకరం అని వారన్నారు. అదే విధంగా దీనిపైన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎమ్మెల్యేలు అందరు స్పందించాలి.బాలురు విద్యార్థులకు దూరం చేసే కుట్రను ప్రభుత్వం మానుకోవాలి. విద్యార్థులకు తీవ్రని నష్టం చేయకూడదు యధావిధిగా బాలుర గురుకులాన్ని అక్కడే కొనసాగించాలి. అదే విధంగా బైపిసి కోర్సుని తీసివేస్తా అని సూచనలు చేస్తున్న ప్రభుత్వం అట్లాంటి చర్యలు చేయకుండా కోర్సులను కొనసాగించాలి విద్యార్థులకు ఆన్లైన్ అడ్మిషన్లను ఆపివేసి వాటిని సవరించి బాలురులకు, బాలికలకు అడ్మిషన్లు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్ సాగర్, నాయకులు వరుణ్, సందేశ్, సన్నీ, శివకుమార్, ఏఐఎస్ఎఫ్ నగర ఉపాధ్యక్షులు కసిరెడ్డి సందీప్, వినయ్, సాయి మరియు పేరెంట్స్ బోయిని సది, చిప్పకుర్తి వెంకట్ స్వామి, కునమల్ల కమలాకర్, గాజుల నర్సయ్య, పల్లె సుధాకర్, కట్కం ఆనంద్, కోట స్వరూప, విద్యార్థి గాజుల సాయిరాజ్, కట్కం విశాల్, పల్లె లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

# బూత్ స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం

• కాంగ్రెస్ పార్టీ కమిటీల ఎన్నికలు పండుగ వాతావరణంలో జరుపుకోవాలి

• కష్టపడ్డ ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటా..

• వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు





**హన్మకొండ, మే 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** బూత్ స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీ ని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్ గోపాల్పూర్ కళా బ్యాంకట్ హాల్ నందు 1,2, 44, 45, 46,55, 56,64,65,66వ డివిజన్ లు ఐనవోలు, హసన్పర్తి మండలాల పరిధిలోని నాయకలు, కార్యకర్తలతో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశాన్ని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే , హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి, టీపీసీసీ అబ్జర్వర్ మాక్సూద్ అహ్మద్, టెస్కాబ్ ఛైర్మన్ మార్నెనీ రవీందర్ రావు పాల్గొని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. టీ-పీసీసీ ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రక్షాళన చేపట్టడం జరిగిందని అన్నారు.క్షేత్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నూతన అధ్యక్ష మరియు కమిటీల ఎంపిక పై కసరత్తు ముమ్మరంగా జరుగుతోందని పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఈ తరుణం ఉపయోగకరంగా ఉండబోతుందని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి పాత, కొత్త నాయకులు కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేసి ఉత్తమ ఫలితాలను అందించారని ప్రజలకు పార్టీకి వారధులుగా నిలిచిన వారికి ఈ కార్యక్రమం ద్వారా నూతన ఒరవడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. క్యాడర్ బేసిక్ ఎన్నికలే పార్టీకి పునాది అని,సామాజిక సమీకరణ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశంలో ముఖ్యమని అన్నారు. ఎంపిక, ఎన్నిక పద్ధతితో పార్టీ కమిటీలో నియామకం చేయాలి అన్నారు.గెలుపు గుర్రాలకే ప్రజాప్రతినిధులుగా పోటీ చేసే అవకాశం కల్పిస్తాం అని,క్యాడర్ బాగుంటే పార్టీ బాగుంటుంది అని చెప్పడానికి వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నిదర్శనమని తెలిపారు.క్యాడర్ కృషితోనే ఎమ్మెల్యే ఎంపీ ఎన్నికల్లో మెజారిటీ పెరిగింది అని,కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతం సామాజిక న్యాయం,కులగనను చేసింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు.కాంగ్రెస్ పార్టీలో క్యాడర్కు గౌరవం ఉంది ,పార్టీ జెండా పార్టీ పార్టీని గెలిపించే వారే నిజమైన కాంగ్రెస్ వాది అన్నారు.క్రింది స్థాయి నుండి వస్తేనే నాయకులుగా ఎదుగుతారని తెలిపారు. గ్రూపులు పెట్టవద్దు అని, కష్టపడ్డా కార్యకర్తకు పార్టీ గుర్తింపు లభిస్తుందని అన్నారు.2017కు ముందు నుండి పార్టీ మారకుండా కాంగ్రెస్ పార్టీ లో కష్టపడ్డ వారికి బ్లాక్ అధ్యక్షులు, మండల, డివిజన్ ,గ్రామ అధ్యక్షులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.నేను కూడా విద్యార్థి దశలో బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, తోకల దేవేందర్ రెడ్డి గార్ల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ విద్యార్థి సంస్థ ఎన్ ఎస్ యు ఐ లో గా చురుగ్గా పని చేశానన్నారు. పార్టీ కోసం కష్టపడే వారి అర్హత ప్రకారం పదవులు వస్తాయి అని పాత, కొత్త, నాయకులు అందరూ కలుపుకొని పని చేసి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ వైస్ ఛైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి రెడ్డి, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, మండల, డివిజన్, గ్రామ స్థాయి అధ్యక్షులు సీనియర్ నాయకులు, కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆలయ ధర్మకర్త మెట్టు రమాదేవి కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ రెండవ వార్షికోత్సవం





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):** పటాన్చెరు డివిజన్ కార్పొరేటర్, వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్త మెట్టు రమాదేవి కుమార్ యాదవ్ ల ఆధ్వర్యంలో మంగళ వారం రోజు పటాన్చెరు డివిజన్ పరిధిలో గల శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయ రెండవ వార్షికోత్సవ మహెూత్సవాలు వైభవంగా జరిగాయి.ఈ ఉత్సవాలలో భాగంగా ఈరోజు ఉదయం 6:30 గంటలకు విశ్వక్సేనారాధన, కంకణ ధారణ, స్వామి వారి అభిషేకం, స్వామివారి హెూమాలు, హరినామ సంకీర్తనలు నిర్వహించారు.అనంతరం శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి దివ్య కళ్యాణ మహెూత్సవం రాగం అనిరుద్ యాదవ్ ,జాగృతి సాయి దంపతులు నిర్వహించడం జరిగింది.పూజా కార్యక్రమాల అనంతరం ఉత్సవాలలో పాల్గొన్న భక్తులందరికీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త, పటాన్ చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయ నిర్మాణం వ్యయ ప్రయాసలకోర్చి పూర్తి చేసిన తరువాత నుండి ప్రతి ఏటా ఆనవాయితీగా ఆలయ వార్షికోత్సవం, స్వామి వారి మంగళ కళ్యాణ మహెూత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమాలలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ శ్రీ రాగం నాగేందర్ యాదవ్, కొండాపూర్ మారబోయిన రాజు యాదవ్, పటాన్చెరు డివిజన్ బి.ఆర్.ఎస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ నాగరాజు,ఆలయ కమిటీ సభ్యులు, అన్నదాన కమిటీ సభ్యులు, పలువురు నాయకులు, స్థానిక కాలనీవాసులు పాల్గొనడం జరిగింది.

# సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి పనులపై చొరవ తీసుకున్న ఎమ్మెల్యే చింతా...



• మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ లో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ని కలిసిన సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్.

• పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఆరా తీశారు.

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 20(పిసిడబ్ల్యూ న్యూస్):** పెండింగ్ లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేసి, పనులు పూర్తి చేసి, ప్రజలకు వినియోగం లోకి తీసుకురావాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ కు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వివరించారు.పనులు పెండింగ్ లో ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు...పనులు నిలిచి పోవడంలో పలు చోట్ల పిచ్చి మొక్కలతో నిండిపోతున్నాయి... అట్టివాటిపై వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లిన పలు అంశాలు. సిద్ధాపూర్, కందిలో అసంపూర్తిగా ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలకు కంది రూ.5 కోట్లు సిద్ధాపూర్ రూ. 4 కోట్లు పనులకు పెండింగ్ బిల్లులు చెల్లించినట్లయితే నెల రోజుల లోపే మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను వినియోగం లోకి తీసుకొచ్చే అవకాశం ఉందని సూచించారు.సంగారెడ్డి, సదాశివ పేట పట్టణాల్లో పెండింగ్‌లో వెజ్ నాన్ ,వెజ్ బిల్డింగ్ పనులు పూర్తి చేయాలి సంగారెడ్డి, సదాశివపేట ,ఆరుట్ల, పెద్దాపూర్ లో సబ్ స్టేషన్ టెండర్ ప్రక్రియ వేగవంతం చేయాలి సదాశివపేట మండల ఎంపీపీ బిల్డింగ్ నిర్మాణానికి రూ.85 లక్షల నిధులు మంజూరు చేయాలి మినీ హజ్ హౌస్ నిర్మాణానికి రూ.2 కోట్లు అదనముగా మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని కోరారు సంగారెడ్డి లో డంపింగ్ యార్డ్ పనులు వేగవంతం చేయాలని తెలిపారు.



# సరస్వతి నవరత్న మాలా హారతి మహోత్సవం





**కాళేశ్వరం, మే 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం లో 6వ రోజు సరస్వతి నవరత్న మాలా హారతి మహోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకాశవంతమైన దేవీ ఆరాధనకు కేంద్రంగా నిలిచిన సరస్వతి నవరత్న మాలా హారతి మహోత్సవం 6వ రోజు నేడు అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా, రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డితో కలిసి సరస్వతి అమ్మవారి హారతిని వీక్షించి దివ్యదర్శనం పొందారు.సరస్వతి అమ్మవారికి రాష్ట్ర ప్రజల శాంతి, సౌభాగ్యం, అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక హారతి, ధార్మిక ఉత్సవాలు సమాజంలో సానుకూల చైతన్యాన్ని కలిగిస్తాయని అన్నారు. నేటితో సరస్వతి పుష్కరాలు ప్రారభమై ఆరు రోజులు అయ్యిందని, ప్రతి రోజు లక్షలాది మంది పుష్కర స్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారని తెలిపారు. గత 6 రోజులుగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే లు పుష్కరాల ఏర్పాట్లు పర్యవేక్షణ చేస్తూ భక్తులకు సౌకర్యాలు కల్పనపై ప్రత్యేక ఫోకస్ చేస్తున్నారని ఏర్పాట్లు పట్ల హర్షం వ్యక్తం చేశారు. రానున్న 6 రోజులు చాలా ముఖ్యమని భక్తులు రద్దీ పెరిగే అవకాశం ఉందని ఎలాంటి లోటుపాట్లు రానీయొద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇంటిలిజెన్స్ డిజి శివధర్ రెడ్డి దంపతులు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ దంపతులు, తల్లిదండ్రులు, ఎస్పి కిరణ్ ఖరే తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి పుష్కరాలు సందర్భంగా కాళేశ్వరంలో ఉచిత ఆరోగ్య శిబిరాలు



● భక్తుల కోసం మెరుగైన వైద్య సేవలు



**కాళేశ్వరం, మే 20 (పిసిడబ్ల్యూ న్యూస్ ):**ఈ నెల 15 వ తేదీ నుండి 26వ తేదీ వరకు జరుగనున్న సరస్వతి పుష్కరాలలో భాగంగా కాళేశ్వరం ప్రాంతానికి విచ్చేస్తున్న భక్తులకు మెరుగైన ఆరోగ్య వైద్య సేవలు అందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య, అత్యవసర వైద్య శిబిరాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ ఆరోగ్య శిభిరాలు మే 15వ తేదీ సరస్వతి పుష్కరాలు ప్రారంభం నుండి మే 26వ తేదీ వరకు పుష్కరాల ముగింపు వరకు కొనసాగనున్నాయి. ప్రతి రోజూ 24/7 మూడు షిఫ్టులలో ఈ ఆరోగ్య కేంద్రాలు నిర్వహించ బడుతూ భక్తులకు వైద్య సేవలు అందిస్తున్నారు. **శిబిరాలలో అందించే సేవలు:** సాధారణ వైద్య పరీక్షలు రక్తపోటు, మధుమేహం, శ్వాస సంబంధిత పరీక్షలు ఫస్ట్ ఎయిడ్ చికిత్సలు అంబులెన్స్ సౌకర్యం ఓఆర్ఎస్ పొడర్లు **వైద్య సలహా మరియు రోగ నిర్ధారణ పరీక్షలు /...** మెడికల్ క్యాంపు లు ...9 మెయిన్ ఘాట్,విఐపి ఘాట్,టెంట్ సిటీ,తాత్కాలిక బస్ స్టాండ్,పాత బస్ స్టాండ్,హరిత విశ్రాంతి భవనం,సరస్వతి ఘాట్,దేవాలయం వద్ద .. 2కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అత్యవసర వైద్య కేంద్రం ముగ్గురు స్పెషలిస్టు వైద్యులతో 24/7 వైద్య సేవలు, ఒక రిఫరల్ యూనిట్ 6 మంది ఎంజిఎం స్పెషలిస్ట్ వైద్యులు పర్యవేక్షణలో 24 గంటలు వైద్య సేవలు అంబులెన్సులు మొత్తం...5 (అందులో ఒకటి అడ్వాన్సు డ్ లైఫ్ సపోర్ట్ తో) బైక్ అంబులెన్స్ లు ...5 ఓఆర్ఎస్ కిట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అన్ని వైద్య శిభిరాల్లో అందుబాటులో ఉన్నాయి.అత్యవసర వైద్య సేవలకు ప్రత్యేక వైద్య బృందాలు 24 గంటలు అందుబాటులో ఉంటున్నాయి.**వైద్య బృందం వివరాలు:** ప్రతి శిబిరంలో ఒక డాక్టర్, ఒక స్టాఫ్ నర్స్ మరియు ఒక ఫార్మసిస్ట్ విధుల్లో ఉంటారు. అత్యవసర వైద్య సేవలకు తక్షణమే తరలించడానికి అంబులెన్స్, రెస్క్యూ సిబ్బంది సేవలు ఏర్పాట్లు చేశారు.విధులు నిర్వహించు సిబ్బంది స్పెషలిస్టు వైద్యులు 23 మంది,వైద్యులు 10 మంది,ఏ ఎన్ ఎమ్స్, సూపర్ వైజర్స్, ఆశా వర్కర్లు 243 మంది,సపోర్టింగ్ స్టాఫ్ 130 మంది,ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ సరస్వతి పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నందున భక్తుల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా ప్రతి ఒక్కరికీ వైద్య సహాయం అందించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఏదేని ఆరోగ్య సమస్యలు వస్తే భక్తులు జాప్యం చేయక సమీపంలోని వైద్య కేంద్రాలను సంప్రదించి తక్షణ వైద్య సేవలు పొందాలని సూచించారు. మొబైల్ బైక్ వాహనాలు ద్వారా భక్తులకు ఓ ఆర్ ఎస్ పాకెట్స్ అందిస్తున్నామని ఓ ఆర్ ఎస్ ద్రావణాన్ని తరచూ త్రాగాలని, భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు.

# తెలుగు చలన చిత్ర పరిశ్రమ గర్వించదగ్గ నటులు నందమూరి తారక రామారావుకి పుట్టిన రోజులు శుభాకాంక్షలు

● దేప శ్యాంసుందర్ ముదిరాజ్ ముదిగొండ వేంకటేష్





**యాదాద్రి మే 20 (పిసిడబ్ల్యూ న్యూస్):**యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపూర్ గ్రామంలో జూనియర్ నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్)జన్మదినం మే20వ తేదీ సందర్భంగా అభిమానులు ముదిగొండ వెంకటేష్ ,దేప శ్యాంసుందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం చేసి అనంతరం మూగజీవాలకు పండ్ల పంపిణీ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ మీ నటనా ప్రతిభతో కోట్ల మంది అభిమానులను గెలుచుకున్న మీరు,ఎప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని మనస్ఫూర్తిగా వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో అభిమానులు బుర్ర అయోధ్య,సందగళ్ళ శెఖర్, పబ్బు శ్రీనివాస్,యండి షాదిక్,దౌడి లింగస్వామి, చందుపట్ల సాయి నేత, కృష్ణ ముర్తి,కిష్టయ్య, పంతంగి.మధు, మహంకాళి జితేందర్,అజ్జి, అబ్బాస్,మహేష్,తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుంట్ల హిమాన్షు బాబుకి రాయిగిరి కమాను వద్ద చింతల యువసేన ఘన స్వాగతం



**యాదాద్రి మే 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా రాయిగిరి కమాను వద్ద చింతల యువసేన ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి సిరిసిల్ల శాసనసభ్యుడు కేటీఆర్ కుమారుడు హిమాన్షు బాబు శ్రీయాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి దర్శనానికి విచ్చేసిన సందర్భంగా మార్గ మధ్యలో ఘన స్వాగతం పలకడం జరిగింది. స్వాగతం పలికిన వారిలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కుతాడి సురేష్,దండ బోయిన బాలరాజు యాదవ్, గాజుల నవీన్ గౌడ్, మోతే మనోహర్, శ్రవణ్, రఘుమ రెడ్డి,మిర్యాల శేషు, ఇర్ఫాన్, పల్లెర్ల ప్రమోద్, సంపత్, రాజు, సాగర్, సోమశేఖర్ మణికంఠ, తదితరులు ఉన్నారు.

# త్రివేణి సంగమ తీరాన పవిత్ర సరస్వతి పుష్కర స్నానాలు





**కాళేశ్వరం, మే 20 (పిసిడబ్ల్యూ న్యూస్ ):**"కాళేశ్వర నివాసోవా,కాళేశ్వర నీరిక్షణం, కాళేశ్వరస్య స్మరణం సర్వపాప వినాశనం"అని స్తుతిస్తూ భక్తులు త్రివేణి సంగమ తీరాన పవిత్ర సరస్వతి పుష్కర స్నానాలు ఆచరిస్తున్నారు. 6వ రోజు కూడా త్రివేణి సంగమం భక్తుల రాకతో కిక్కిరిసిపోతోంది. సువిశాలంగా విస్తరించిన త్రివేణి సంగమంలో లక్షలాది మంది భక్తులు పుణ్య స్నానాలు చేసేందుకు చేరుకుంటున్నారు. అంతర్వాహిని సరస్వతి నదిలో పుష్కర స్నానమాచరించిన భక్తులు పుణీతులై నీరాజానాలు అర్పిస్తున్నారు. 6వ రోజు కూడా భక్తుల తాకిడీ తీవ్రంగా పెరగడంతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణలో అధికార యంత్రాంగం సేవలం దించే విధుల్లో నిమగ్నం అయింది. త్రివేణి సంగమ ంలో ఏర్పాటు చేసిన పుష్కర ఘాట్ల వద్ద భక్తులు నది లోపలకు వెళ్లకుండా ఉండేందుకు, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు బారికేడ్లు, గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాలను, బోట్లు అందుబాటులో ఉంచిన అధికారులు భక్తులు ప్రమాదా లకు గురి కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు.**6వ రోజు...**పుష్కర నదికి మొదటి 12 రోజుల్లో ఒక్కో రోజు ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ఆ ప్రత్యేకతననుసరించి భక్తులు దానం చేయడం వల్ల పుణ్యం లభిస్తుందని పురణాలు చెప్తున్నాయి. ప్రకృతిలో భాగమైన నదుల వద్ద సహజత్వాన్ని పెంపొందిం చేందుకు భక్తులు కూడా చొరవ తీసుకోవాలన్న సంకల్పంతోనే హైందవ ఆచారాలు పాటించాల్సి ఉంటుంది. ప్రాకృత్య ధర్మానికి మించింది మరోటి లేదన్నది చేతల్లో చూపించేందుకే పూర్వీకులు ఈ సాంప్రదాయాలను కొనసాగించే వారు. పుష్కర నది తీరంలో 6వ రోజున ఔషధ దానం, కర్పూర దానం, చందన దానం, కస్తూరి దానం చేయాలని పురణాలు వివరించాయి. ఈ రోజు పుష్కర సరస్వతి ఒడిలో పుణ్య స్నానాలు చేసిన భక్తులు దానాలు చేయడం మంచిదని చెప్తున్నాయి. 6వ రోజైన మంగళవారం తెలంగాణ, ఏపీ, చత్తీస్ గడ్, ఒడిషా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు కాళేశ్వరం చేరుకుంటున్నారు.

# ప్రజలు - విప్లవం,విముక్తి మార్గం..

● ప్రజా యుద్ధ పంథాలో జననేత జనార్ధన్ ● ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి



**యాదాద్రి మే 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజలను విప్లవం,విముక్తి కోసం దీర్ఘకాలిక సాయుధ ప్రజా యుద్ధ పంథా మార్గంలో నడిపించిన కామ్రేడ్ జలగం జనార్ధన్ సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు గా అంచెలంచెలుగా ఎదుగుతూ,పీడిత ప్రజల పక్షాన నిలబడి పోరాడిన గొప్ప కమ్యూనిస్టు విప్లవ కారుడు అని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్)తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్ష పతి సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్ లు అన్నారు. మంగళవారం నాడు ఆలేరు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో కామ్రేడ్ జన్నుసార్ 4 వ వర్ధంతి సభను నిర్వహించారు.ఈ సందర్భంగా బిక్షపతి,జనార్ధన్ లు మాట్లాడుతూ,కాశ్మీర్ ఫెహల్గామ్ ఘటన అనంతరం చోటుచేసుకున్న యుద్ధ పరిణామాలు, పరిస్థితులను ప్రజలకు వివరించడంలో మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిదని,యుద్ధం వద్దు శాంతిని నెలకొల్పుటకు ప్రయత్నాలను మొదలుపెట్టాలని చెప్పిన దేశ ప్రజల అభిప్రాయాలను ఏ మాత్రం లెక్కచేయని మోడీ ప్రభుత్వం, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ముందు సాగిలపడిన బీజేపీ మోడీ ప్రభుత్వం అమెరికా యుద్ధాన్ని ఆపాలని అదేశించగానే జీ హుజూర్ అని యుద్ధాన్ని ఆపిందని విమర్శించారు.దేశ ప్రజల, ప్రజాస్వామిక వాదుల అభిప్రాయా లను పరిగణనలోకి తీసుకోకుండా మావోయిస్టులతో చర్చలు జరపాలని ఎంత చెప్పినప్పటికీ వినకుండా తన అప్రజాస్వామిక అణిచివేత దోరణీని కొనసాగిస్తూ ఆదివా సీలను, మావోయిస్టులను చంపుతున్న దుర్మార్గపు చట్టాలను కొనసాగిస్తూనే ఉన్నదని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, జిల్లా,డివిజన్ నాయకులు మామిడాల సోమయ్య,ఆర్.సీత, కల్లెపు అడివయ్య, పద్మ సుదర్శన్, సాదుల శ్రీకాంత్, మాలోత్ మోతీలాల్, వగ్గు మల్లయ్య,గడ్డం మంకయ్య, చిర బోయిన కొమురయ్య, నమిలే స్వామి, తలారి వెంకటేష్, చింతకింది సత్యనారాయణ, కుర్రి సత్యనారాయణ, మామిడాల సావిత్రి,తమ్మడి రమేష్, యెలగందుల సిద్దులు, ఆర్.ఉదయ్, వంగాల నర్సింహారెడ్డి, ఇక్కిరి బీరయ్య, పంజాల మురళి, తదితరులు పాల్గొన్నారు.